J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 11 15.8.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




● జిల్లాల పునర్విభజన

## ఈ 'తేనెతుట్టె'ను కదిలిస్తే...

# ఎవరికి ఇష్టం.. ఎవరికి కష్టం!

### జాగ్రత్త పడకుంటే విమర్శలు ఖాయం

### ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యమిస్తేనే ఫలితం

### మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చే నివేదికపై ఉత్కంఠ

### త్వరలోనే కొత్త జిల్లాల ప్రకటన

### 32 కానీ 33 కానీ ఉండే అవకాశం

**తనదైన ముద్ర వేయడమే ధ్యేయంగా పాలనలో కొత్తపంథాను అనుసరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మరో చారిత్రక అంశంపై దృష్టిసారించారు. ఈమేరకు గతంలో అసంబద్ధంగా, అశాస్త్రీయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్ వ్యవస్థీకరణలోని లోపాలను సరిచేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఏడుగురు మంత్రులతో సబ్‌కమిటీ వేసిన ఆయన, వారికి స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. అవసరమైన మేరకు జిల్లాల సంఖ్యను పెంచడంతో పాటు జిల్లా కేంద్రాల మార్పు, పేర్ల మార్పు, సరిహద్దుల మార్పుపై ప్రతిపాదనలు చేయాలని ఉపసంఘాన్ని ఆదేశించినట్లు సమాచారం. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా స్థానిక ప్రజల ఆకాంక్షలు, కోరికలతో పాటు ఆయా ప్రాంతాల చారిత్రక నేపథ్యం, సంస్కృతి, పాలనాపరమైన సౌలభ్యాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పినట్లు ఊహాగానాలు సాగుతున్నాయి. ఈనేపథ్యంలో సబ్‌కమిటీలోని మంత్రులు గత ప్రభుత్వం తరహాలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విభజనలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే, ప్రభుత్వంపై విమర్శలతో పాటు ఆందోళనలూ తప్పకపోవచ్చు. దీంతో రాష్ట్ర ప్రజలందరినీ సంతృప్తి పరుస్తూ జిల్లాల ఏర్పాటు ప్రక్రియను కూటమి నేతలు ఎలా గట్టెకిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.**

### గతంలో పార్లమెంట్ నియోజకవర్గం ప్రాతిపదికగా!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం, 2014 జూన్‌లో అప్పటికున్న 23 జిల్లాల్లో పదింటిని తెలంగాణకు, మిగిలిన 13 జిల్లాలను విభజిత ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. ఈ క్రమంలో 2016లో అప్పటి సీఎం కేసీఆర్ తెలంగాణలో జిల్లాల సంఖ్యను 33కి పెంచారు. ఇక 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2022 ఏప్రిల్ 3వ తేదీన అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల విభజన ప్రక్రియను చేపట్టింది. ఇందులో లోక్‌సభ నియోజకవర్గాన్ని ప్రాతిపదికగా తీసుకుని 25 జిల్లాలు ఏర్పాటు చేయాలని భావించింది. అయితే పాడేరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధి చాలా ఎక్కువగా ఉండడంతో దాన్ని 2 జిల్లాలు చేసింది. దీంతో మొత్తం జిల్లాల సంఖ్య 26కి చేరింది.

### పలుచోట్ల ఆందోళనలు-ఆగ్రహజ్వాలలు!

పరిపాలనా సౌలభ్యం, స్థానిక ప్రజల ఇష్టాయిష్టాలతో పనిలేకుండా కేవలం పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లా ఏర్పాటుకు ప్రాతిపదికగా తీసుకోవడంతో పలుచోట్ల అప్పట్లో ఆందోళనలు జరిగాయి. ముఖ్యంగా బొత్స సత్యనారాయణకు లబ్ధి చేరూర్చేందుకు విశాఖ జిల్లాలోని ఎస్‌కోటను విజయనగరం జిల్లాలో కలిపేయడం, విజయవాడకు దగ్గరగా ఉండే పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాలను ఎన్‌టీఆర్ జిల్లాలో కాకుండా కృష్ణా జిల్లాలో కలపడం, మార్కాపురాన్ని, మదనపల్లెను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయకపోవడంపై అక్కడి ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. అయితే వాటిని అప్పటి జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా అక్కడి ప్రజల్లో ఇంకా అసంతృప్తి జ్వాలలు ఎగసిపడుతూనే ఉన్నాయి. పైగా జిల్లాలైతే ఏర్పాటు చేశారే కానీ వాటికి కావాల్సిన భవనాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనపై అప్పటి ప్రభుత్వం దృష్టి సారించలేదు. అలాగే కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించి రాష్ట్రపతి ఆమోదముద్ర కోసం కేంద్ర హోంశాఖకు వివరాలు పంపించేందుకు ఏకంగా 18 నెలలు సమయం తీసుకోవడం కూడా విమర్శలకు కారణమైంది. దీంతో ఇప్పటి వరకు కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించి కేంద్ర హోంశాఖ స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ కారణంగా ఉద్యోగాలు, యూనివర్సిటీల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు ఉమ్మడి 13 జిల్లాల ప్రాతిపదికగానే చేస్తున్నారు. దీంతో

2లో

## జూనియర్ ఎన్టీఆర్

# మనసులో ఏముంది?

➤ బాబాయ్ బాలకృష్ణపై జూనియర్ వార్ ప్రకటించాడా?

➤ ప్రత్యక్ష రాజకీయాలలో అడుగుపెట్టడం ఖాయమా?



*నందమూరి కుటుంబసభ్యులకి, జూనియర్ ఎన్టీఆర్‌కి మధ్య దూరం పెరుగుతోందా? తాను నందమూరి హరికృష్ణ కుమారుడిని అని ఓ వైపు, స్వర్గీయ నందమూరి తారక రామారావు మనుమడిని అని మరోవైపు ప్రకటించుకుంటూనే ఎక్కడా తన బాబాయ్ బాలకృష్ణ పేరు ప్రస్తావించకపోవడమే అందుకు నిదర్శనమా? 2029 నాటికి ప్రత్యక్ష రాజకీయాలలో అడుగు పెట్టడానికి వ్యూహం రచించుకుంటున్నాడా? ఇలాంటి ప్రశ్నలకి అవుననే సమాధానమే సినీ, రాజకీయ వర్గాలనుండి వినపడడం గమనార్హం.*

జూనియర్ ఎన్టీఆర్‌కి నందమూరి కుటుంబానికి మధ్య వార్ నడుస్తోందన్న వార్తలకి వార్ -2 ఫంక్షన్ బలాన్ని చేకూర్చింది. తారక్‌కి నందమూరి కుటుంబంతో పొసగడంలేదన్న విషయం నిజమే అని వార్ వేడుకతో తేలిపోయింది.

మొన్న 10వ తేది ఆదివారం హైదరాబాదులో జరిగిన వార్-2 సినిమా ప్రీ రిలీజ్ సంబరంలో జూనియర్ ఎన్టీఆర్ వ్యవహరించిన తీరు, మాట్లాడిన విధానం రాజకీయ, సినీ వర్గాల అనుమానాలకి బలం చేకూరుస్తున్నాయి. ఆ వేడుకలో ముందుగా వార్-2 సినిమా గురించి, హృతిక్ రోషన్ గురించి మాట్లాడిన తారక్.. ఇక అసలు విషయానికి వద్దాం అంటూ... "దివంగత నందమూరి తారక రామారావు గారి ఆశీస్సులు తనకి ఉన్నంత వరకు తనని ఎవరూ ఏమీ పీకలేరని" అన్నారు. అంతే కాకుండా "తన తండ్రి దివంగత నందమూరి హరికృష్ణ, అన్న కీ.శే. నందమూరి జానకిరామ్ దీవెనలతో పాటు తన మరో అన్న కళ్యాణ్‌రామ్, లక్షలాది మంది తన అభిమానుల అండదండలు తనకి ఉంటాయి" అని కూడా ప్రకటించాడు. ఎక్కడా ఇతర నందమూరి కుటుంబసభ్యుల గురించి కానీ, ఇప్పటికే అటు సినిమా రంగంలో ఇటు రాజకీయాలలో తన ఉనికిని చాటుకుంటున్న తన బాబాయ్ నందమూరి బాలకృష్ణ పేరు కానీ ఉచ్చరించలేదు. అంతేకాకుండా త్వరలో తన అభిమానులందరినీ కలుసుకుంటానని, అందరితో ఒక్కొక్కరిగా ఫోటో తీసుకుంటానని కూడా వాగ్దానం చేశాడు. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ కూడా తాను రాజకీయాలలోకి రావాలనుకున్నప్పుడు ఇలాగే ప్రకటించి వందలాది మంది అభిమానులతో ఒక్కొక్కటిగా ఫోటో షూట్ కూడా పెట్టుకున్నారు. అయితే, ఆయన రాజకీయ అరంగేట్రం టీ కప్పులో తుఫానులా తేలిపోయింది. ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ చేసిన ఈ 'ఫోటో' ప్రకటన కూడా అనేక అనుమానాలకు అవకాశం ఇస్తోంది.

తాను సినిమారంగంలో అడుగుపెట్టి పాతికేళ్ళు పూర్తయ్యాయని, ఒక్క అభిమానితో మొదలైన తన ప్రస్థానం ఈరోజు లక్షలాది మంది ఫాన్స్‌ని తన సొంతం చేసిందని అన్నారు. మనమంతా ఎప్పటికీ ఇలాగే కలిసుందామని, కలసి ముందుకు వెళదామని రెండు కాలర్లు ఎగరేస్తూ పిలుపునిచ్చారు.

### జూనియర్ ఊసెత్తని లోకేష్!

ఇదే తరుణంలో మరోవైపు టీడీపీ యువరాజు లోకేష్‌బాబు కూడా తనదైన స్టైల్‌లో స్పందించారు. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సినీ రంగ ప్రవేశం చేసి యాభై సంవత్సరాలు నిండిన సందర్భంగా లోకేష్ తన అభినందనలు తెలిపారు. రజనీ కొత్త సినిమా కూలీ సూపర్ హిట్ కావాలని ఆకాంక్షించారు. అదే సమయంలో ఇండస్ట్రీకి వచ్చి పాతిక సంవత్సరాలు పూర్తి చేసుకున్న జూనియర్ ఎన్టీఆర్ గురించి కానీ, ఆయన కొత్త సినిమా వార్-2 గురించి కానీ లోకేష్ ఎక్కడా మాట్లాడలేదు. ఈ పరిణామాలన్నిటినీ భవిష్యత్ రాజకీయాలలో సంభవించబోయే పలు మార్పులకి సంకేతాలుగా రాజకీయ విశ్లేషకులు, సినీ విమర్శకులు వ్యాఖ్యానించడం గమనార్హం!

## ధర్మస్థలి రహస్యం

# పాతిపెట్టిన నిజాలు - తవ్వుతున్న ప్రశ్నలు

***ఒక** దశాబ్దానికిపైగా అజ్ఞాతంలో గడిపిన ఒక వ్యక్తి, భరించలేని అపరాధ భావంతో కుమిలిపోతూ, అధికారుల ముందుకు వచ్చాడు. ఆ క్షణం, కర్ణాటకలోని పవిత్ర పుణ్యక్షేత్రం ధర్మస్థల దశాబ్దాల నిశ్శబ్దాన్ని ఛేదించుకుని ఉలిక్కిపడింది. అతను ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు. 1995 నుంచి 2014 వరకు ఆలయ పరిసరాల్లో పనిచేసిన ఆ దళిత వ్యక్తి చెప్పిన విషయాలు దేశాన్ని నివ్వెరపరిచాయి. "వందలాది మృతదేహాలను పూడ్చిపెట్టాను, వారిలో ఎక్కువమంది మహిళలు, చిన్నారులే" అని ఆయన చెప్పినప్పుడు, అది కేవలం ఆరోపణగా మిగిలిపోలేదు. అది పశ్చాత్తాపంతో దహించుకుపోతున్న ఒక మనస్సాక్షి పెట్టిన ఆర్తనాదం. అతని సాక్ష్యం ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. లైంగిక దాడి ఆనవాళ్ళతో, గొంతు నులిమిన గుర్తులతో ఉన్న మృతదేహాలను పూడ్చిపెట్టాలని తనను బలవంతం చేశారని ఆ వ్యక్తి ఆరోపించాడు.*

పవిత్ర పుణ్యక్షేత్రం ధర్మస్థలిలో ఆయన చెప్పిన సామూహిక ఖననాల ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(SIT) ఇప్పుడు తన వ్యూహాన్ని మార్చింది. కేవలం ఒక సాక్షి మాటలపై ఆధారపడకుండా, శాస్త్రీయ ఆధారాల కోసం అన్వేషణ ముమ్మరం చేసింది. నేత్రావతి నది ఒడ్డున, ఫిర్యాదుదారుడు చూపిన 13వ స్థానం వద్ద తవ్వకాలు సంక్లిష్టంగా మారడంతో, భూగర్భంలో ఏముందో గుర్తించడానికి గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్(GPR) టెక్నాలజీని ఉపయోగించాలని SIT నిర్ణయించింది. ఈ సాంకేతిక పరిజ్ఞానం కోసం ఢిల్లీ, బెంగళూరులోని ఏజెన్సీలను సంప్రదిస్తున్నారు. దర్యాప్తు పరిధిని విస్తరిస్తూ, బాహుబలి కొండల సమీపంలో కొత్త ప్రదేశాలను గుర్తించడంతో, మొత్తం శ్మశాన వాటికల సంఖ్య 17కి పెరిగింది. ఈ పరిణామాలు, దశాబ్దాలుగా అణచివేయబడిన భయానక నిజాలను వెలికితీసే ప్రయత్నంలో తాజా అధ్యాయాన్ని సూచిస్తున్నాయి.





2014లో తన బంధువుల అమ్మాయిపై వేధింపులు జరగడంతో, ప్రాణభయంతో ఊరు విడిచి పారిపోయాడు. తన మాటలకు బలం చేకూర్చేందుకు, ఆయన స్వయంగా ఒకచోట తవ్వి అస్థిపంజరాన్ని వెలికితీసి, ఫోటోలతో సహా పోలీసులకు సమర్పించాడు.

ప్రజల ఆగ్రహంతో ప్రభుత్వం SITని ఏర్పాటు చేయగా, జూలై 28న తవ్వకాలు ప్రారంభమయ్యాయి. సాక్షి, ఫిర్యాదుదారుడు చూపిన మొదటి ఐదు ప్రదేశాల్లో ఏమీ లభించకపోవడంతో ఆయన మాటలపై సందేహాలు తలెత్తాయి. కానీ, జూలై 31న ఆరవ స్థానంలో తవ్వకాలు జరుపుతుండగా, పాక్షిక మానవ అస్థిపంజరం బయటపడింది. ఇది దర్యాప్తులో ఒక పెద్ద ముందడుగు. ఆ తర్వాత 11వ స్థానం వద్ద దర్యాప్తును కీలక మలుపు తిప్పిన ఆవిష్కరణ జరిగింది. అక్కడ 100కు పైగా ఎముకలు, ఒక మానవ పుర్రె, వెన్నెముక బయటపడ్డాయి. వాటన్నిటికంటే ముఖ్యంగా, ఆ ప్రదేశంలో ముడివేసిన ఒక ఎర్ర చీర, పురుషుల చెప్పులు లభించాయి. ముడివేసిన చీర లభించడంతో, బాధితురాలిని చీరతో గొంతు నులిమి హత్య చేసి ఉండవచ్చనే అనుమానాలు బలపడ్డాయి. ఈ అవశేషాలన్నింటినీ ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. ఫలితాలు రావడానికి రెండు మూడు నెలలు పట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ధర్మస్థలంలో ఇలాంటి ఆరోపణలు కొత్త కాదు. 1980ల నుంచే ఇక్కడ అసహజ మరణాలు, వాటిని కప్పిపుచ్చే ప్రయత్నాలపై నిరసనలు ఉన్నాయి. 2012లో 17ఏళ్ల విద్యార్థిని సౌజన్యపై జరిగిన అత్యాచారం, హత్య కేసులో నిందితుడు 2023లో నిర్దోషిగా విడుదలయ్యాడు. ఆలయ నాయకత్వంతో సంబంధం ఉన్న పలుకుబడి కలిగిన వ్యక్తులను కాపాడేందుకే దర్యాప్తును తప్పుదోవ పట్టించారని సౌజన్య కుటుంబం ఆరోపిస్తూనే ఉంది. 2003లో అదృశ్యమైన వైద్య విద్యార్థిని అనన్య భట్ తల్లి సుజాతా భట్, తన కుమార్తె కూడా ఈ బాధితుల్లో ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

ఈ కేసులో అత్యంత ఆందోళనకరమైన అంశం, వ్యవస్థాగత వైఫల్యానికి సంబంధించిన ఆరోపణలు. సమాచార హక్కు చట్టం (RTI) ద్వారా ఒక దిగ్భ్రాంతికరమైన నిజం బయటపడింది. బెళ్తంగడి పోలీస్ స్టేషన్‌లో 2000 నుంచి 2015 మధ్య నమోదైన అన్ని అస్వాభావిక మరణాల రికార్డులను ధ్వంసం చేశారు. ఈ 15ఏళ్ల కాలం, ఫిర్యాదుదారుడు ఆరోపణలు చేసిన కాలంతో దాదాపుగా సరిపోలుతుంది. ఈ రికార్డుల ధ్వంసం దర్యాప్తుకు కోలుకోలేని దెబ్బ. ఇది Destroying old records.. సాధారణ పరిపాలనా ప్రక్రియ అని పోలీసులు చెప్పినప్పటికీ, కీలకమైన డేటాను పూర్తిగా తొలగించడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు, SIT బృందంలోని ఒక సబ్-ఇన్‌స్పెక్టరే ప్రధాన సాక్షిని బెదిరించి, ఫిర్యాదును వెనక్కి తీసుకోమని ఒత్తిడి చేశారని అతని తరపు న్యాయవాది ఆరోపించారు.

ఈ నేరాలు యాదృచ్ఛిక హింసాత్మక చర్యలు కావు. అవి కులం, లింగం అనే పునాదులపై నిర్మించిన సామాజిక బలహీనత అనే నిర్మాణం వల్ల సాధ్యమయ్యాయి. ఈ వ్యవస్థ, "పట్టించుకోనవసరం లేని" బాధితులను (మహిళలు), బలవంతంగా మౌనంగా ఉంచబడిన ఒక సహచరుడిని(దళిత వ్యక్తి) సృష్టించింది. ఇది నిందితులు ఎలాంటి శిక్షా భయం లేకుండా దశాబ్దాలుగా తమ దురాగతాలను కొనసాగించడానికి వీలు కల్పించి ఉండవచ్చు. ఈ భయంకరమైన అధికార సమీకరణం ఇలా పనిచేస్తుంది: పలుకుబడి కలిగిన పురుషులు(నిందితులు), మహిళల శరీరాలపై (బాధితులు) తమ అధికారాన్ని ప్రదర్శిస్తారు, ఆ సాక్ష్యాలను చెరిపేయడానికి ఒక నిమ్న కుల పురుషుడిని(సాక్షి) బలవంతం చేస్తారు. ఈ నిర్మాణం తనను తాను కాపాడుకుంటుంది. మహిళలపై హింస అధికారాన్ని ప్రదర్శిస్తుంది. దళిత వ్యక్తిపై బలవంతం కుల ఆధిపత్యాన్ని నిలబెడుతుంది. ఇద్దరి మౌనాన్ని మరింత హింస అనే బెదిరింపుతో నిర్ధారిస్తారు. అందువల్ల, ఈ సామాజిక నిర్మాణాన్ని విశ్లేషించకుండా ధర్మస్థల కేసును పూర్తిగా అర్థం చేసుకోలేం. ఈ నేరాలు ఒక అసాధారణ సంఘటన కాదు, బహుశా కులం, లింగ వివక్షలు కలిసి సృష్టించిన అణచివేత, దోపిడీ, బలవంతపు నిశ్శబ్దంతో కూడిన వ్యవస్థకు ఒక లక్షణం కావచ్చు.

ఈ కేసు ఒక ఊరిని రెండుగా చీల్చింది. యూట్యూబర్లు, స్థానికుల మధ్య ఘర్షణలు అరెస్టుల వరకు దారితీశాయి. ఇప్పుడు అందరి చూపు ఫోరెన్సిక్ నివేదికలపైనే ఉంది. ఆ నివేదికలే ఈ కేసులో నిష్పాక్షిక సత్యానికి చివరి ఆశాకిరణం. పాతిపెట్టిన నిజాలను వెలికితీయడానికి జరుగుతున్న ఈ అన్వేషణ, చివరికి శక్తిమంతులను జవాబుదారీగా నిలబెట్టగలదా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి.

**- నవీన్**
**సీనియర్ జర్నలిస్ట్, రాజమహేంద్రవరం.**

# ఎవరికి ఇష్టం.. ఎవరికి కష్టం!

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాల విభజనలోని లోపాలను సరిదిద్ది కొత్త మార్గదర్శకాలు రూపొందించి మరోసారి కేంద్ర హోంశాఖ ధ్రువీకరణ కోసం పంపించాలని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈమేరకు మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చే నివేదికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

### ఉపసంఘం ప్రతిపాదనల తర్వాత కేబినెట్ ఆమోదం!

ఏడుగురు మంత్రులతో ఏర్పాటు చేసిన జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ఉపసంఘానికి మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వం వహిస్తున్నారు. అలాగే రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు. ఈ కమిటీ ప్రజల నుంచి నేరుగా విజ్ఞప్తులు స్వీకరించి ఆ తర్వాత కొత్తజిల్లాలు, జిల్లా కేంద్రాల మార్పు, సరిహద్దుల మార్పుపై నివేదిక రూపొందించి కేబినెట్ ముందుంచనుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలలో మార్పులు చేర్పులు చేపట్టి మొత్తం జిల్లాల సంఖ్యను 32 కానీ, 33గా కానీ నిర్ణయించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇందులో అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, తిరుపతి జిల్లాలోని గూడూరు, శ్రీకాకుళం జిల్లాలోని పలాస, గుంటూరు జిల్లాలోని అమరావతి, కర్నూల్ జిల్లాలోని ఆదోని, ప్రకాశం జిల్లాలోని మార్కాపురం కొత్త జిల్లాలు కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక పోలవరం విలీన మండలాలతో కలిపి రంపచోడవరంను కూడా కొత్త జిల్లాగా చేస్తారనే ప్రచారం సాగుతోంది. ఈనేపథ్యంలో కొత్తజిల్లాలు ఏర్పాటయ్యే ప్రాంతల ప్రజల మనోభావాలను పరిశీలిస్తే.. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను బాపట్ల, నెల్లూరుజిల్లాల్లో కలిపారు. వాటిని మళ్లీ వెనక్కి తీసుకొచ్చి ప్రకాశం జిల్లాలోనే కలిపే అవకాశం కనిపిస్తోంది. ఇక ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రస్తుతం కర్నూల్, నంద్యాల జిల్లాలుగా ఉంది. శ్రీబాగ్ ఒడంబడిక కాలం నుంచి ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న కర్నూలు జిల్లా విభజన తర్వాత భౌగోళిక పరంగా ప్రాధాన్యత కోల్పోయింది. కర్నూలుకి అత్యంత సమీపంలో ఉండే నందికొట్కూరు, డోన్ నియోజకవర్గాలను నంద్యాల జిల్లాలో కలిపారు. అలాగే జిల్లాలోని ప్రముఖ పుణ్యకేత్రాలు శ్రీశైలం, మహానంది, అహోబిలం వంటివాటినీ, శ్రీశైలం, పోతిరెడ్డిపాడు, ఎస్ఆర్‌బీసీ వంటి ప్రాజెక్టులను నంద్యాల జిల్లాలోనే చేర్చారు. దీంతో కర్నూలుకి ఎలాంటి ప్రాముఖ్యతా లేకుండా పోయింది.

ఇక ఉమ్మడి నెల్లూరుజిల్లా విషయానికొస్తే అప్పటికున్న 10 నియోజకవర్గాల్లో మూడింటిని తిరుపతిజిల్లాలో కలిపేశారు. వీటిలో మైన్స్‌కు పేరుగాంచిన గూడూరు, ఇస్రో రాకెట్ ప్రయోగకేంద్రమైన శ్రీహరికోట ఉండే సూళ్లూరుపేట, అలాగే వెంకటగిరి నియోజకవర్గాలు ఉండడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న ఏడు నియోజకవర్గాల్లో రెవెన్యూ రాబడిలో జిల్లాకే తలమానికంగా ఉండే సర్వేపల్లి నియోజకవర్గాన్ని కూడా విడదీసి గూడూరు జిల్లా పేరిట కొత్త జిల్లాను ఏర్పాటు చేస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే నెల్లూరుజిల్లా ప్రాముఖ్యత పూర్తిగా తగ్గుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. అత్యధిక జనాభా కలిగిన జిల్లా అనే గుర్తింపును కూడా కోల్పోనుంది. ఇక గూడూరు కేంద్రంగా ఏర్పడే జిల్లాలో గూడూరుతో పాటు వెంకటగిరి, సూళ్లూరుపేట, సర్వేపల్లి నియోజకవర్గాలు ఉంటాయని వార్తలొస్తున్నాయి.

ఇక ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనూ భారీ మార్పులే ఉండే అవకాశం కనిపిస్తోంది. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నియోజకవర్గాలను అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు కేటాయించారు. ఇందులో రాజంపేట పార్లమెంట్ స్థానం పరిధిలో అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేశారు. అయితే జిల్లా కేంద్రంగా రాజంపేటను కాదని రాయచోటిని ఎంపిక చేశారు. దీనిపై గతంలో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఇక అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా గుర్తింపు పొందిన మదనపల్లె జిల్లాను ఏర్పాటు చేయకపోవడంతో అక్కడి ప్రజలు అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలోని పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలతో పాటు చిత్తూరు జిల్లాలోని పుంగనూరు కలిపి మదనపల్లె జిల్లాగా చేయనున్నారు. అలాగే అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి రాజంపేటకు మార్చనున్నారు. ప్రస్తుతం నగరి నియోజకవర్గం చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నా అందులోని పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాలో చేర్చారు. తాజాగా నగరి నియోజకవర్గంలోని నగరి, విజయపురం, నింద్ర మండలాలను కూడా తిరుపతి జిల్లా పరిధిలోకే తీసుకురానున్నట్లు సమాచారం. ఇక ప్రకాశం జిల్లాలోని మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు ఖాయంగా కనిపిస్తోంది, గత ఎన్నికల సమయంలో చంద్రబాబు మార్కాపురం జిల్లాపై స్పష్టమైన హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర రాజధాని అయిన అమరావతి పేరుతో లోకేష్ నియోజకవర్గం మంగళగిరితో పాటు జగ్గయ్యపేట, నందిగామ, పెదకూరపాడు, తాడికొండను చేర్చనున్నారు. ఇవే జరిగితే రాష్ట్ర నైసర్గిక స్వరూపం పూర్తిగా మారిపోయే అవకాశం కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలో జిల్లాల మార్పు ఎవరికి ఇష్టమో.. ఎవరికి కష్టమో త్వరలోనే తేలిపోనుంది.!

## 17 నుంచి సీపీఐ మహాసభలు

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నెల్లూరుజిల్లా మహాసభలు ఆగస్టు 17 నుంచి 19వ తేదీ వరకు నెల్లూరు నగరంలోని కోటమిట్టలో ఉన్న షాదీమంజిల్‌లో నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య చెప్పారు. అదేవిధంగా, ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయని తెలిపారు.



## చంద్రన్నకి రాఖీ కట్టిన.. ప్రశాంతమ్మ

రాఖీ పండుగ సందర్భంగా ఈనెల 9న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రాఖీ కట్టి తన సోదరప్రేమను చాటుకున్నారు. అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె చంద్రబాబును కలసి, రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రి నుంచి ఆశీస్సులు అందుకున్నారు. అన్నాచెల్లెళ్ళ అనురాగబంధానికి ప్రతీకగా నిలిచిన రాఖీ పండుగ రోజున ఆత్మీయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి రాఖీ కట్టడం తనకెంతో ఆనందంగా ఉందని ప్రశాంతమ్మ సంతోషం వ్యక్తం చేశారు.



### రంగనాథస్వామి దేవాలయంలో..
## నిత్యాన్నదానానికి ఏర్పాట్లు

ఎట్టకేలకు నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో భక్తుల కోసం నిత్యాన్న పథకం ప్రారంభం కాబోతోంది. ఆమేరకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. గతంలో ఎప్పుడో వీలున్నప్పుడు, అప్పుడప్పుడూ మాత్రమే ఆలయ ప్రాంగణంలో అన్నదానం జరుగుతుండేది. ప్రతిరోజూ ఆలయంలో అన్నదానం చేయాలనుకోవడం మాత్రం ఇదే ప్రథమం అనుకోవచ్చు. ఎంతెంతో దూరాన్నుంచి ఆలయానికి వచ్చే భక్తులకు ఈ పథకం మరింతగా ఉపయోగపడుతుంది. ఈ పథకానికి 5,116 రూపాయలకు పైగా విరాళం ఇచ్చినవారికి, ఆ దాత పేరుతో, వారు కోరిన రోజున అన్నదానం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

## కమలం లాగా..పార్టీ వికసించాలి



కమలం లాగా పార్టీ వికసించాలంటూ కమల దళాధిపతి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. రాష్ట్ర అధ్యక్షులయ్యాక ఆయన తొలిసారిగా ఈనెల 13న నెల్లూరుకు వచ్చినప్పుడు, బీజేపీ నాయకుడు..'నమామి గంగే' రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఆయన్ను కలిసి కమలం పుష్పాన్ని అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, మన పార్టీ కూడా ఇలాగే కమలంలా వికసించాలంటూ చిరునవ్వులు చిందించారు. పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేయాలని సూచించారు.

## యువత సన్మార్గంలో పయనించాలి



నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (విఎస్యు)లో ఈనెల 12న అంతర్జాతీయ యువత దినోత్సవ వేడుకలు జరిగాయి. విఎస్యు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ డా.సునీత మాట్లాడుతూ, యువత దేశపురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెడు మార్గాల జోలికివెళ్లకుండా విద్యార్థులు మంచి వైపు అడుగులు వేయాలని ప్రిన్సిపాల్ డా. విజయ సూచించారు. తొలుత, స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. సెట్నెల్ సీఇఓ నాగేశ్వరరావు, జిల్లా యువజన అధికారి ఎం.మహేంద్రరెడ్డి, కేంద్ర సమాచార అధికారి పి.హరికృష్ణ, స్టూడెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హనుమారెడ్డి, మేనేజర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ గయాజ్ పాల్గొన్నారు.

### సోమశిల డ్యామ్‌కి..
## వరద నీరు

గత కొద్ది రోజులుగా జిల్లా పైతట్టు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో సోమశిల జలాశయానికి వరదనీటి ప్రవాహం పెరిగింది. బుధవారం నాటికి డ్యామ్‌లో నీటి నిల్వ 41.954 టీఎంసీలు ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 23,088 క్యూసెక్కుల వరద నీరు వస్తోందని, దీంతో జిల్లాలో డెల్టాకి 1850 క్యూసెక్కులు, వరద కాలువకి 7200, ఉత్తర కాలువకి 340 క్యూసెక్కుల వంతున నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. రానున్న వర్షాలతో జలాశయంలో వరదనీటి ప్రవాహం అంతకంతకూ పెరుగుతుందని కూడా భావిస్తున్నారు. అల్పపీడనం వల్ల రెండుమూడు రోజుల్లో భారీ వానలు కురిసే అవకాశం కూడా ఉందంటున్నారు.

## చల్లగాలి.. చిరుజల్లులు

ఎట్టకేలకు అల్పపీడనం ప్రభావంతో గత రెండుమూడు రోజులుగా జిల్లాలో చల్లని వాతావరణం ఏర్పడింది. చల్ల గాలి.. చిరుజల్లులతో చెట్టూచేమా పులకించిపోతున్నాయి. ఎండ వేడిమి తగ్గడంతో ప్రజలు సంతోషిస్తున్నారు. అప్పుడప్పుడూ వాన జల్లులు కురుస్తుండడంతో చెట్లకు ఊపిరి వచ్చినట్లయింది. తోటలు, పంటపొలాలు ఈ ముసురు వాతావరణంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. రాత్రివేళ ఒక్కోసారి కాస్త జోరువాన కూడా కురుస్తోంది.

## త్వరలో 'యానాది గర్జన'

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యానాదుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ. విజయవాడలో త్వరలో 'యానాది గర్జన' కార్యక్రమం నిర్వహించనున్నట్లు యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య చెప్పారు. నెల్లూరులోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఈనెల 13న పలు జిల్లాల నుంచి వచ్చిన యానాది సంఘాల నాయ కులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యానాదులు ఎన్నోరకాల సమస్యలతో నిత్యం నానా యాతనలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యానాదుల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు.

### సంగమేశ్వరాలయంలో..
## 15న లక్ష కుంకుమార్చన

మండల కేంద్రమైన సంగంలో వెలసివున్న శ్రీ కామాక్షీదేవి సమేత శ్రీ సంగమేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆగస్టు 15 శుక్రవారం నాడు మహన్యాసపూర్వక విశేష ఏకాదశ ద్రవ్యాలతో రుద్రాభిషేకం, శ్రీ కామాక్షిదేవి అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు వైభవంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు గణపతిపూజ, స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, 9 గంటలకు శ్రీ కామాక్షిదేవి అమ్మవారికి అభిషేకం, బంగారు కవచాలంకరణ, అనంతరం లక్ష కుంకుమార్చన జరుగుతాయని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి-అమ్మవార్ల కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని, ఆలయ కార్యనిర్వహణాధికారి పోట్ల రఘురామయ్య కోరారు.

### కొత్త అధ్యక్షుడు మాధవ్ రాకతో..
# బీజేపీలో నూతనోత్సాహం

- పార్టీని పటిష్ఠం చేయాలన్న రాష్ట్ర నేత



బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టాక పీవీఎన్ మాధవ్ తొలిసారిగా నెల్లూరు పర్యటనకు రావడంతో జిల్లా బీజేపీలో నూతనోత్సాహం వెల్లువెత్తింది. జిల్లావ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో కదలివచ్చారు. ఆయన పర్యటించిన ప్రాంతాల్లోని బీజేపీ శ్రేణులు ఆయన్ను ఘనంగా స్వాగతించాయి. పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు నెల్లూరుకు తరలివచ్చి తమ కొత్తనేతను కలుసుకుని, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో కోలాహలం నెలకొంది. తమ పార్టీ రాష్ట్ర నాయకుని రాక సందర్భంగా నాయకులు, కార్యకర్తలు నెల్లూరు నగరంలోని అనేక ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టి స్వాగతం పలికారు.

### నాయకులు-కార్యకర్తలతో ఆత్మీయ పలకరింపులు :

తొలుత మాధవ్ స్థానిక వేదాయపాళెం కూడలిలో టీ తాగుతూ అందరితో ఆత్మీయంగా మాట్లాడారు. నాయకులను, కార్యకర్తలను పలకరిస్తూ 'చాయ్ పే చర్చా' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన్ను ఘనంగా స్వాగతించారు. అక్కడ నుంచి నగరంలోని ఆత్మకూరు బస్టాండువద్ద ఉన్న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరిగి దర్గామిట్టలోని కస్తూరిబా కళాక్షేత్రం వరకు వందలాది కార్యకర్తలు, నాయకులతో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. సాయంత్రం శివాజీ సెంటర్‌లో శివాజీ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆతర్వాత, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో స్వర్ణకారులతో సమావేశం నిర్వహించారు.

### పార్టీని మరింత బలోపేతం చేయాలి

ఆ తర్వాత కళాక్షేత్రంలో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు అందరూ పట్టుదలతో గట్టి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. నాయకులంతా కూడా కార్యకర్తలకు సహకరిస్తూ, సమన్వయంతో పార్టీని పటిష్ఠం చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో బీజేపీకి కేటాయించే నామినేటెడ్ పోస్టులు గణనీయంగా పెరిగాయని సంతోషం వ్యక్తం చేస్తూ, కార్యకర్తలు నాయకులుగా మారితే ఆ సంఖ్య ఇంకా పెరుగుతుందని ఆయన అన్నారు. రానున్న సంస్థాగత ఎన్నికల్లో పార్టీకి మరిన్ని స్థానాలు కేటాయించడానికి కృషిచేస్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్రప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేస్తోందన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఇస్తున్న నిధుల వివరాలను నాయకులు, కార్యకర్తలు తెలుసుకుని ఆ వివరాలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి ఏడాదికి పది లక్షల కోట్ల రూపాయలకు పైగానే నిధులొచ్చాయని తెలిపారు. జగన్‌ను బీజేపీ వెనకేసుకొస్తోందన్నది కేవలం అపోహ మాత్రమేనని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా బీజేపీ అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, కార్యదర్శి కే.రాజేశ్వరి, నాయకులు భరత్‌కుమార్, ఆంజనేయరెడ్డి, రఘుపతిరాజు, ఇంచార్జ్ అంకయ్యనాయుడు, నాయకులు ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, రఘునాథరాజు, తెలుగు సంస్కృతి విభాగం ఛైర్మెన్ ఆర్‌డీ విల్సన్, ఏ.శరత్‌చంద్ర, కాకు విజయలక్ష్మి, కమల, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచే..ఉచిత బస్సులు




ఆగస్టు 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు 'స్త్రీ శక్తి' పేరుతో ఉచిత బస్సు పథకాన్ని అమలుచేయడానికి ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లాలోని మహిళా ప్రయాణీకులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి షేక్ షమీమ్ కోరారు. మహిళా ప్రయాణీకుల పట్ల డ్రైవర్-కండక్టర్లు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఈనెల 13న జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన ఆర్టీసీ సిబ్బందికి చెప్పారు.

లాయర్
ఆగస్టు 15, 2025

# అంధకారంలోనే ఆదివాసీ జీవితాలు

నేటి మానవుడు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో అంతరిక్ష యాత్రలే చేస్తున్నా, నేటికీ అనేకమంది మానవులు ఏ కొండ కోనల్లోనో అనాదిగా కష్టాలతోనే జీవిస్తున్నారు. ప్రపంచమంతా ప్రగతివైపు పరుగులు పెడుతున్నా, వారింకా అథోగతిలోనే ఉంటున్నారు. అడవులు, కొండల్లో ఆహ్లాదకరమైన ప్రకృతి సోయగాల మధ్య స్వచ్ఛంగా బతుకుతున్న ఆదివాసీల జీవితాలు ఏళ్ళ తరబడిగా ఎలాంటి సౌకర్యాలు లేక అంధకారంలోనే ఉంటున్నాయి. అభివృద్ధి పేరుతో జరుగుతున్న ప్రకృతి విధ్వంసాలతో అనేక దేశాల్లో వారి జీవితాలు అల్లకల్లోలంగానే ఉంటున్నాయి. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా వీరి పరిస్థితి ఇలాగే ఉంటోంది. భిన్న జాతులు, విభిన్న సంస్కృతులకు నిలయమైన మనదేశంలో కూడా ఎంతో విలక్షణమైన వీరి జీవన స్థితిగతుల్లో ఎలాంటి మార్పు లేకపోవడం విచారకరం. దీంతో ఆదివాసీలు శతాబ్దాల తరబడి వెనుకబడే ఉంటున్నారు. దేశ జనాభాలో 8శాతానికి పైగానే ఉన్న ఆదివాసీలు కల్లాకపటం తెలియని వారు. కొండకోనలెంత స్వచ్ఛంగా ఉంటాయో వారి మనసులు కూడా అంతే. వారు ఇతరత్రా జీవనవిధానాల పట్ల ఆసక్తి చూపకపోవడంతో, ప్రభుత్వాల పథకాలు ఎక్కడో మారుమూల కొండల్లో నివసిస్తున్న అనేక మంది ఆదివాసీల దరిచేరడం లేదు. ఏ కొద్దిమందో తాము కష్టపడి పండించిన ఉత్పత్తులను మార్కెట్ దాకా తీసుకువస్తున్నా, వాటికి కనీసం గిట్టుబాటు ధర ఇవ్వకుండా కొందరు అక్రమార్కులు బురిడీ కొట్టిస్తున్నారు. సమాజంలోని నేటి ఆధునిక మానవునికి ఉన్న హక్కులు, సంతోషకరమైన జీవితాలు.. కొండకోనల్లో జీవించే ఆదివాసీలు, గిరిజనులకు కూడా ఉండాలని ఎంతోకాలంగా ఐక్యరాజ్య సమితి స్పష్టం చేస్తున్నా, ఆచరణలోకి మాత్రం రావడం లేదు. అనేకదేశాల్లో నేటికీ వారికి తగిన గుర్తింపు కానీ, సరైన భద్రత కానీ ఉండడం లేదు. వారి కట్టుబొట్టూ, భాష, ఆచారాలు, సంస్కృతి సంప్రదాయాలు ఎంతో వైవిధ్యంగా ఉంటాయి. తమకు తెలిసిన దారిలోనే వారు బతుకుతుంటారు తప్ప, ఇతరత్రా మార్గాలను వారు అనుసరించరు. ముఖ్యంగా వారి జీవనానికి అనువైన అటవీభూములు కానీ, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కానీ ఉండని అటవీ ప్రాంతాలెన్నో ఉన్నాయి. సరైన దారి డొంకలు లేక, చిత్తం వచ్చిన దారుల్లో వారు వెళ్లిపోతుంటారు. విద్యుత్ సదుపాయాలకు కూడా నోచుకోక అనేక ఆదివాసీ, గిరిజన తాండాలు నేటికీ చిమ్మచీకట్లోనే తమ జీవితాలను గడిపేస్తున్నాయి. వారికంటూ హక్కులు, ప్రత్యేక చట్టాలెన్ని ఉన్నా అవి ఆశించినస్థాయిలో ఆచరణలోకి రావడం లేదు. ఇలాంటి బాధలన్నీ తీర్చి, ఆదివాసీలకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రతి దేశం నడుం బిగించాలని ఐక్యరాజ్య సమితి ఎంతోకాలంగా అన్నిదేశాలకు విజ్ఞప్తిచేస్తూనే ఉంది. ప్రత్యేకించి ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా పరిగణిస్తూ, ఆదివాసీల అభ్యున్నతికి అన్నిదేశాలు సంకల్పం చేసుకోవాలని, వారిని అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించింది. కానీ, ఎవరి ధోరణి వారిది అన్నట్లుగా అనేకదేశాల్లో వారి బాధలను ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఈ దుస్థితి తొలగిపోవాలి. ఆదివాసీలను వారి సంప్రదాయాలను, కళలను గుర్తించి గౌరవించాలి. వారి కష్టాలు కన్నీళ్లను మంచిమనసుతో అర్థం చేసుకుని మానవతా హృదయంతో వారిని ఆదుకోవాలి. నిరక్షరాస్యులుగా ఉన్న ఆదివాసీలు, ఆదిమతెగలు, గిరిజనులకు చదువుల పట్ల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పట్ల కూడా వీలైనంత అవగాహన కల్పించాలి. అక్షరజ్ఞానంతో అంధకారాన్ని జయించేలా చూడాలి. ఇంకా, వారిని ఎలా తీర్చిదిద్దితే వారి జీవితాలు కష్టాల నుంచి బయటపడతాయో కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఆలోచించాలి. ఏంచేస్తే వారికి ప్రయోజనకరంగా ఉంటుందో పాలకులు, ప్రభుత్వాలు, మేధావులు అందరూ కలసి యోచించి తగు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుచేయాలి. ముఖ్యంగా, వారి కనీస సదుపాయాలకు, రక్షణకు ఎలాంటి లోటు లేకుండా చూడాలి. ఎలాంటి వివక్షకు, అణచివేతకు గురికాకుండా, వారి అభ్యున్నతికి చట్టాలను మరింత కట్టుదిట్టం చేయాలి. ఎంతటి సుదీర్ఘ ప్రస్థానానికైనా తొలి అడుగే ప్రధానం. అందుకే అందరూ కలసి ముందడుగు వేయాలి. మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలూ ఆదివాసీలు, అమాయక గిరిజనుల పట్ల మరింత మానవీయతను చూపుతూ, వారికి మెరుగైన జీవితాలను ప్రసాదించాలని గట్టిగా ప్రయత్నించాలి. అప్పుడే.. వారి జీవితాల్లో వెన్నెల వెలుగులు ప్రసరించేందుకు మార్గం సుగమం అవుతుంది.

# ధీరోదాత్తుడు మన మోడీ..!

మన ప్రధాని నరేంద్ర మోడీ తన ధీరోదాత్తతని, పాలనా నైపుణ్యాన్ని మరోసారి నిరూపించుకుంటున్నారు. తమ ఇష్టానుసారం సుంకాలు విధిస్తూ భారత్‌ని బెదిరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ని మన ప్రధాని ఏమాత్రం లెక్కచేయడం లేదు. అమెరికా తాటాకు చప్పుళ్ళకి బెదరడం లేదు. పైగా నీకు చేతనైంది చేసుకో రష్యాతో సంబంధాల విషయంలో మా నిర్ణయాలలో ఎలాంటి మార్పు ఉండదని నిక్కచ్చిగా అమెరికాకి బదులు చెప్పారు. ఇండియాది డెడ్‌ఎకానమీ అన్న ట్రంప్ వ్యాఖ్యలకి గట్టిగా సమాధానం చెప్పారు. మూడవ అతి పెద్ద ఎకానమిగా ఇండియన్ ఎకానమీ ఎదుగుతోందన్నారు. రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫామ్ విధానంలో దేశం ఎదుగుతోందన్నారు. రష్యా – భారత్ ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడేలా పావులు కదుపుతున్నారు. కయ్యానికి కాలు దువ్వుతున్న ట్రంప్ వైఖరికి బదులుగా సై అంటే సై అన్నట్లుగా ధీటుగా స్పందిస్తున్నారు. దటీజ్ నరేంద్రమోడీ..!

– యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

# నేతలూ, అధికారులూ.. వానలొస్తున్నాయి పారా హుషార్!

నెల్లూరు పేరుకే నగరం. కానీ మంచివాన పడితే అది నరకమే. పెద్ద వానలు కురిస్తే రైలు కట్టకి ఇటు తూర్పు అటు పడమర వాళ్ళు ఎక్కడికక్కడ ఉండిపోవాల్సిందే. ఇదే విషయాన్ని మన నెల్లూరు ముద్దుబిడ్డ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారు చాలా సందర్భాల్లో చెప్పారు. అయితే, ఆయన కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా పదవిలో ఉన్న తరుణంలో సైతం ఈ సమస్యకి శాశ్వత పరిష్కారం చూపలేకపోవడం విచారకరం. ఇప్పుడు మళ్ళీ వానాకాలం రానే వస్తుంది. ప్రతిసారీ వర్షాలు పడడం, ఎక్కడి నీళ్ళు అక్కడే నిల్చిపోవడం, అధికారులు, రాజకీయ నాయకులు జేసీబీలు తెచ్చి దురాక్రమణలు తొలగించడం, ఫొటోలకి ఫోజులిచ్చి పత్రికలలో ఫోటోలు వేయించుకోవడం పరిపాటైపోయింది. అలాకాకుండా వర్షాలు పడకముందే వాళ్ళు మేల్కోవాలి. ఎక్కడెక్కడ కాలువలు దురాక్రమణలు జరిగాయో గుర్తించి వాటిని వెంటనే తొలగించాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు కాకుండా ముందుగానే కళ్ళు తెరవాలి. సెప్టెంబర్ నుండి నవంబర్ వరకూ వానలు తరచూ కురుస్తూనే ఉంటాయి. కాబట్టి ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. అందుకే “నేతలూ, అధికారులూ వానలొస్తున్నాయి పారా హుషార్” అంటున్నాను..!

– కే. వేణుగోపాల్‌రెడ్డి, గోమతీనగర్.




# నిజాలు.. నిర్భయంగా ఉంటున్నాయి!

‘లాయర్’లో ‘సత్యపీఠం’ శీర్షికలో ప్రతి వారం వస్తున్న వ్యాసాలు బాగుంటున్నాయి. ‘విద్య వ్యాపారమైందంటూ’ విద్యా రంగంలోని స్థితిగతులని వివరిస్తూ ఓ వారం, ‘అతిసర్వత్ర వర్జయేత్’ అని రాజకీయ నేతల తీరుతెన్నులని వర్ణిస్తూ మరో వారం, వైద్య రంగంలో జరుగుతున్న దోపిడీని కళ్ళకు కట్టినట్లు చెప్తూ ‘వైద్యో నారాయణో హరి –కాంచనాం ఖర్మ విమోచనం’ అన్న మాటలకి అర్థాలే వేరయా... అని నిర్మొహమాటంగా తెలియజేస్తూ ఇంకో వారం వచ్చిన వ్యాసాలు అద్భుతం. ఇక తాజాగా ప్రభుత్వ హాస్టళ్ళ గురించీ, మనుషులతో మానవ మృగాలు చేస్తున్న వ్యాపారం గురించీ, ఇలా ప్రతి వారం ఒక ప్రజోపయోగ అంశాన్ని ఎంపిక చేసుకుని నిజాలని నిర్భయంగా రాస్తున్న మన ‘లాయర్’కి హ్యాట్సాఫ్...!

– డి. హరిత, గూడూరు.




# ‘హెల్మెట్’ పెట్టుకోండి.. ప్రాణాలు కాపాడుకోండి

మనదేశంలో ద్విచక్ర వాహన చోదకులకి ఉన్నంత నిర్లక్ష్యం ఇతర ఏ దేశంలోనూ మనకి కనపడదు. మనోళ్ళకి ఉన్నంత బద్ధకం ఇతర దేశాల్లో ఎక్కడా మనకి కనిపించదు. అలా ఉంటే ‘ప్రమాదం నాయనా, ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతాయి..’ అని ఎంతగా బుజ్జగించి చెప్పినా సరే.. లెక్కే ఉండదు. తమ అలక్ష్యం వల్ల తమకే కాక, ఇతరుల జీవితాలు కూడా దెబ్బతింటాయని తెలిసినా, పట్టించుకోరు. దేశంలోని అత్యధికశాతం మంది ద్విచక్ర వాహనదారుల ధోరణి ఇలాగే ఉంటోంది. ఆ అలసత్వం వల్లనే దేశంలో రోడ్డు ప్రమాదాలు ఇటీవలికాలంలో భారీగా పెరిగిపోతున్నాయి. వాటిలో ప్రత్యేకించి, హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల తలకు గాయాలై మరణిస్తున్నవారి సంఖ్య కూడా రానురాను పెరిగిపోతోంది. కేంద్రప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం చూసినా, హెల్మెట్ లేకుండా ప్రమాదాలకు గురై చనిపోయిన వారి సంఖ్య ఒక్క 2022లోనే 50వేల మందికి పైగానే ఉందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో ఆలోచించాలి. ఇది ఇలాగే కొనసాగితే ఈ మరణాల సంఖ్య లక్షల్లోకి చేరిపోతుందని కూడా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచంలో మనమే ఫస్ట్...!

ప్రపంచవ్యాప్తంగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో మనదేశమే నెంబర్ 1 స్థానంలో ఉందంటే అతిశయోక్తి కాదు. ఉదాహరణకి 2021లో దేశంలో జరిగిన మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 69,240 చనిపోతే, అందులో హెల్మెట్లు లేకపోవడంవల్ల తలకు గాయాలై చనిపోయిన వారి సంఖ్య 30,800మంది వరకు ఉంది. ఇక, ఏటా ఇదే విధంగా ఆ మరణాలు కూడా పెరిగిపోతూనే ఉన్నాయి. 2022లో హెల్మెట్ పెట్టుకోకపోవడంతో ప్రమాదాల్లో తలకు గాయాలు తగిలి 50వేల మందికి పైగానే మరణించారని గణాంకాలు చెప్తున్నాయి. ఇలా.. హెల్మెట్ లేకుండా ప్రమాదాలకు గురై ఏటా వేలాదిమంది మృత్యువాత పడుతున్నట్లు అంచనా. ఇంత పెద్దఎత్తున ప్రమాదాలు, మరణాలు పెరిగిపోతున్నా ద్విచక్రవాహనదారుల్లో మాత్రం చలనం ఉండడం లేదు. వారిలో మార్పు రావడంలేదు. తాము చేస్తున్నది తప్పే అని తెలిసి కూడా ‘నా బైకు.. నా ఇష్టం’ అన్నట్లుగా మూర్ఖంగా వాదిస్తుంటారే తప్ప, తమ జీవితాలకి హెల్మెట్ ఎంతో రక్షణ కల్పిస్తుందన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు.

## నియమ నిబంధనలను అస్సలు పట్టించుకోరు :

వాహనాలు నడపాలంటే ఎన్నో నియమ నిబంధనలుంటాయి కానీ, ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. చట్టాలనేకం ఉన్నా ఖాతరు చేయడం లేదు. ఓవైపు అటు అధికారులు, ఇటు పోలీసులు పదేపదే చెప్తున్నా, మరోవైపు కోర్టులు మొట్టికాయలు వేస్తూనే ఉన్నా, వాహనదారులు మాత్రం తమ పద్ధతి మార్చుకోవడం లేదు. ట్రాఫిక్ రూల్స్‌ను సక్రమంగా పాటించక ప్రమాదాలు కొనితెచ్చుకుంటూనే ఉన్నారు. అతివేగం వద్దు, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు!.. రక్షణగా హెల్మెట్‌లు పెట్టుకోండి.. అంటూ అధికారులు, పోలీసులు పదేపదే చెప్తూనే ఉన్నా అనేకమంది వినడమే లేదు. అసలే వాహనాల రద్దీ ఇటీవలి కాలంలో ఎక్కడ చూసినా భయంకరంగా ఉంటోంది. రోడ్డుమీదికి వెళ్తే చాలు ఎటువైపు నుంచి ప్రమాదం వస్తుందో తెలియదు. అందులోనూ ద్విచక్రవాహనాలు నడిపేవారు అతివేగంగా నడపడం గొప్పగా ఫీలవుతుంటారు. ఇక.. కుర్రకారు చేతికి బండి చిక్కిందంటే.. వాళ్ళని ఆపలేం. బైక్‌ని వంకరటింకర్లుగా మెరుపు వేగంతో తిప్పుతూ, రోడ్ల మీద నానారకాల ఫీట్లు చేస్తుంటారు. ప్రమాదాలకి గురై వారే కాక, వారి తల్లితండ్రులకు తీరని వేదన కలిగిస్తుంటారు. కర్మ కాలి లేదా విధివశాత్తూ జరిగే రోడ్డు ప్రమాదాలను ఎవరూ ఆపలేరు కానీ, ఆ ప్రమాదాల్లో తల పగిలి చావకుండా కాపాడే హెల్మెట్‌లు మనకు రక్షణగా ఉంటున్నా వాటిని పెట్టుకోవాలంటే బహు చిరాకు పడుతున్నారు. అందులోనూ, ఇద్దరు వెళ్లాల్సిన బైక్‌మీద నలుగురైదుగురు వెళ్తుంటారు. ముందు ఇద్దరు చిన్నపిల్లలు, వెనుక మరో పిల్ల, లేదా పిల్లోడు, ఆ వెనుక భార్య అయిదుగురూ అత్యంత వేగంగా గాల్లో తేలిపోతుంటారు. నడిపేవాడికి హ్యాండిల్ తిప్పాలన్నా కష్టంగానే ఉంటుంది. అయినాసరే, అట్లాగే వెళ్తుంటారు. అదేమని అడిగితే, ‘మేం రోజూ పోతుండ్లా.. ఏమవుద్ది?’.. అని ఎదురు ప్రశ్నిస్తారు. ప్రమాదం జరిగితే ‘ఏం చేస్తాం.. మా కర్మ’ అంటారు.

## హెల్మెట్ ఉండేది మన రక్షణ కోసమే :

ఇటీవలి కాలంలో ఆసుపత్రుల్లో చేరే రోడ్డుప్రమాద బాధితుల్లో అత్యధికశాతం మంది తలకు గాయాలైన వారేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రమాదంలో కిందపడి, తలకు దెబ్బతగలడం వల్ల ప్రాణాలు కోల్పోయేవారే ఎక్కువగా ఉంటున్నారని అంటున్నారు. ప్రమాదం జరిగాక బండి నడిపేవారు, బండికింద పడేవారు అందరూ కలసి ఆసుపత్రులకు వేలకు వేలు ఖర్చుపెడుతుంటారు కానీ, ముందుగా అలాంటివేమీ జరగకుండా ఓ వెయ్యో, పదిహేనువందలో పెట్టి, ప్రాణాలని కాపాడే ఒక్క హెల్మెట్ మాత్రం కొనుక్కోరు. పోలీసులు కేసులు పెడుతున్నారని తెలిస్తే, ఆ దారిని వదిలిపెట్టి దొంగదారుల్లో వెళ్ళిపోతుంటారు. ఇప్పటికైనా మేల్కోవాలి. ఇంట్లో నుండి బయటకి వెళ్ళే ముందు కుటుంబాన్ని, తమమీదనే ఆధారపడిన భార్యా బిడ్డలని గుర్తుతెచ్చుకోవాలి. అదే యువతరమైతే మిమ్మల్ని కని, పెంచి ఆశలన్నీ మీపైనే పెట్టుకుని బ్రతుకుతున్న మీ అమ్మా నాన్నలని ఒక్కసారి తలచుకోవాలి. ద్విచక్రవాహనదారులారా!.. తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోండి. అది కూడా నాసిరకానిది కాకుండా ప్రభుత్వ గుర్తింపుపొందిన నాణ్యమైన హెల్మెట్లనే వాడండి. మీరు వాడడమే కాకుండా మీ పక్కవారికి కూడా చెప్పండి. హెల్మెట్ పెట్టుకుని మీ ప్రాణాలతో పాటు రోడ్డు మీద వెళ్ళే ఇతరుల ప్రాణాలను కూడా కాపాడండి!..

- రాజశ్రీ

# మాటల మంత్రిని కాదు..చేతల మంత్రిని!

## • మంత్రి నారాయణ



తాను మాటల మంత్రిని కాదని, చేతల మంత్రినని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. తనపై ఎవరెన్ని ఆరోపణలు చేసినా ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. తమ కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుంటే.. వైకాపా నాయకులు ఓర్వలేకపోతున్నారని, అందుకే ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని మైపాడుగేట్ వద్ద స్మార్ట్ సిటీలో భాగంగా ఏర్పాటుచేస్తున్న షాపులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలిచ్చారు. వాటిని తీసుకున్న మెప్మా మహిళలకు మంత్రి తన సొంతనిధి నుండి లక్ష రూపాయల వంతున ఆర్థిక సహాయం అందజేసి మహిళల మన్ననలందుకున్నారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, నెల్లూరు నగరంలో వెయ్యి మంది మెప్మా మహిళలకు షాపులు కేటాయించాలన్నది తమ ఉద్దేశమన్నారు. అందులో భాగంగానే తొలివిడతలో 240 షాపులకు ఆమోదం తెలిపామన్నారు. అందులో 120 షాపులను తొలివిడతగా ఈ నెలలోనే ప్రారంభిస్తామని, ఒక్కో షాపు ఏర్పాటుకు నాలుగు లక్షలు ఖర్చు అవుతోందని తెలిపారు. మెప్మా, కార్పొరేషన్‌లనుంచి రెండు లక్షలు సబ్సిడీ వస్తుందని, రెండులక్షలు బ్యాంకు రుణం ఇస్తుందని తెలిపారు.

### అన్ని పార్కులను ఆధునీకరిస్తాం :

నెల్లూరు నగరంలోని అన్ని పార్కులను ఆధునీకరిస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. మొదటగా బోడిగాడితోట, బంగ్లాతోట, బాలభవన్, రేబాలవారి వీధి, ఎన్టీఆర్ నగర్ వాటర్ ట్యాంక్, మూడు జెండాల సెంటర్‌లలో పార్కుల ఆధునీకరణ పనులను పరిశీలించారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలసి చిల్డ్రన్స్ పార్కులో క్రీడాపరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన మాటప్రకారం ఇక్కడ పాతిక లక్షలతో క్రీడా పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని 54 డివిజన్‌లలో పార్కుల అభివృద్ధిని సంబంధిత కన్సల్టీల వారికి అప్పజెప్తామన్నారు. నగరంలోని అన్ని పార్కులను సుందరీకరిస్తామని, చిల్డ్రన్స్ పార్కును మోడల్ పార్కుగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, తాళ్ళపాక అనూరాధ, విజేతారెడ్డి, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.



### మంత్రి నారాయణకు రాఖీలు కట్టిన మహిళలు

నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ ఇటీవల పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన ఏ ప్రాంతంలో పర్యటించినా రాఖీ పండుగ సందర్భంగా మహిళలు ఆయనను సాదరంగా స్వాగతించి, రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరంలోని అనేకమంది మహిళలు సోదరభావంతో తనకు ఆత్మీయంగా రాఖీలు కట్టి ఆశీర్వదించడం కొండంత బలాన్నిచ్చిందని, అందరి ఆశీస్సులతో నెల్లూరును అభివృద్ధిలో అగ్రగామిగా మారుస్తానని అన్నారు.

# రొయ్యల ఎగుమతి రంగాన్ని రక్షించండి



## - రాజ్యసభలో బీఎంఆర్

దేశంలో రొయ్యల ఎగుమతి రంగాన్ని రక్షించాలని, రొయ్యల రైతుల కష్టాలు తీర్చాలంటూ ఇటీవల రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు(బీఎంఆర్) కోరారు. రాజ్యసభలో ఇటీవల ఆయన జీరో అవర్‌లో దేశంలోని ఆక్వారంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు మరియు వాటి పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం తీసుకోవలసిన విధాన నిర్ణయాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. గ్లోబల్ మార్కెట్ ఒత్తిడితో ధరలు పడిపోయాయని, అమెరికా సుంకాల పెంపుతో లక్షలాది రైతుల జీవనాధారం ప్రమాదంలో పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రంగం సుస్థిరతకు అవసరమైన విధాన మార్పులు, మౌలిక వసతుల అభివృద్ధి అవసరమన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద వెనామి రొయ్యల ఎగుమతిదారుగా నిలుస్తోందని, 2023-24లో 7.16లక్షల మెట్రిక్ టన్నుల వెనామి రొయ్యలను, రూ.40,013 కోట్ల విలువతో ఎగుమతి చేసిందని, అయినప్పటికీ, ప్రపంచ మార్కెట్ లో ధరలు 15-20 శాతం తగ్గడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. దీంతో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో చాలామంది రైతులు రొయ్యల సాగును నిలిపివేశారన్నారు. అంతేకాకుండా, అమెరికా ఇప్పటికే 26 శాతం సుంకం విధించగా, 2025 ఆగస్టు 27 నుండి అదనంగా మరో 25 శాతం సుంకం విధించనుందని, దీనివల్ల రూ. 7 బిలియన్ల ఎగుమతులకు ముప్పు ఏర్పడిందని ఆయన రాజ్యసభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రభుత్వానికి నాలుగు కీలక విజ్ఞప్తులు చేశారు. హేచరీ నుండి ఎగుమతి దశ వరకు బ్లాక్‌చెయిన్ ఆధారిత ట్రేసబిలిటీ అమలు చేయాలని, ఎంపెడా ద్వారా రొయ్యలలో యాంటీబయాటిక్స్ ధృవీకరణ, పరీక్ష కేంద్రాల విస్తరణ అవసరమని, పీఎంఎంఎస్ ద్వారా ఐక్యుఎఫ్ యూనిట్లు, మొబైల్ చిల్లింగ్ సౌకర్యాలకు సబ్సిడీలు కల్పించాలని, యూరప్, జపాన్, మధ్యప్రాచ్య దేశాలకు మార్కెట్ విస్తరణ చేయాలని ఆయన సూచించారు. రైతుల జీవనాధారాన్ని కాపాడటానికి భారత ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బాధ్యతలు చేపట్టిన..సబ్ కలెక్టర్



కందుకూరు సబ్‌కలెక్టర్‌గా కొత్తగా నియమితులైన దామెర హిమవంశీ ఈనెల 11 సోమవారం నాడు బాధ్యతలు చేపట్టారు. చిత్తూరులో శిక్షణ పూర్తయ్యాక, ఇదే తనకు తొలి పోస్టింగ్ అని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన నెల్లూరులో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# నేతన్నలకు అండగా నిలిచిన ప్రభుత్వం

## • కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



చేనేత అంటే కేవలం వస్త్ర తయారీ మాత్రమే కాదు, అది మన సంస్కృతిలో ఒక భాగమని, నేతన్నలకు తమ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తూ వారి అభ్యున్నతికి బాటలు వేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు.

ఇటీవల ఆమె జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కోవూరు మండలం పాటూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేతన్నలను ప్రోత్సహించేందుకు వారంలో ఒకరోజు ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలను ధరించాలన్నారు. ప్రభుత్వం నేతకారులను ప్రోత్సహించేందుకు హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులపై వున్న 5శాతం జీఎస్టీని రాష్ట ప్రభుత్వమే భరిస్తుందన్నారు. చేనేత కారుల ఇళ్ళకు ఉచిత విద్యుత్తును నేటి నుంచే అమలు చేస్తోందన్నారు.

అంతేకాక, మంగళగిరి తరహా వీవర్స్ శాలను రాష్ట వ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక మాస్టర్ వీవర్స్‌కు ఆర్థిక సహాయం అందించేందుకు కొత్తగా 45 చేనేత సహకార సంఘాలను ఏర్పాటుచేస్తే.. ఒక్క కోవూరు పరిధిలోనే 3 సొసైటీలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. తాము పి-4 కార్యక్రమంలో భాగంగా బుచ్చి మండలంలోని రామచంద్రాపురం ఎస్టీ కాలనీని దత్తత తీసుకొని విపిఆర్ ఫౌండేషన్ తరఫున అభివృద్ధి చేస్తున్నామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. తొలుత ప్రశాంతిరెడ్డిని చేనేతకారులు సాదరంగా స్వాగతించి, ప్రత్యేకంగా నూలు పోగులతో చేసిన మాల వేసి తమ అభిమానం చాటుకున్నారు. చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అందచేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా చేనేత ఉత్పత్తులలో కొత్తదనం తీసుకురావాలని ఆమె చేనేత కార్మికులకు సూచించారు.

## క్యాన్సర్ బాధితులకు బాసటగా..

# అపోలో హెల్ప్‌లైన్

## • 24 గంటలూ పనిచేసేవిధంగా ఏర్పాటు



క్యాన్సర్ వ్యాధి నిర్మూలన ఒక సామాజిక బాధ్యతగా తీసుకున్న అపోలో హాస్పిటల్స్ సంస్థ శక్తివంచన లేకుండా అందుకు కృషిచేస్తోందని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ చెప్పారు. క్యాన్సర్ రోగులకు అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు వైద్య సహాయం కోసం దేశంలో మొట్టమొదటిసారిగా అపోలో హాస్పిటల్స్ సంస్థ క్యాన్సర్ కేర్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో ఇటీవల క్యాన్సర్ కేర్ హెల్ప్ లైన్ సెంటర్‌ను సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జీవీవీ ప్రసాద్, ఆంకాలజీ ఫిజీషియన్ డాక్టర్ హరిత, నెల్లూరు అపోలో హాస్పిటల్ యూనిట్ హెడ్ బాలరాజుతో కలిసి డాక్టర్ శ్రీరామ్ సతీష్ ప్రారంభించారు. అనంతరం విలేకర్లతో వారు మాట్లాడుతూ, క్యాన్సర్ రోగులకు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేలా హెల్ప్‌లైన్ సెంటర్ 24 గంటలూ పనిచేసే ఫోన్ నంబర్ 1800-203-1066ను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ నంబర్‌కు ఫోన్ చేసి పరిస్థితిని తెలియజేస్తే వైద్యులు అప్పటికప్పుడు అవసరమైన వైద్య సలహాలు అందజేస్తారన్నారు. దేశంలోని అన్ని అపోలో హాస్పిటల్స్ మరియు అపోలో క్యాన్సర్ సెంటర్లలో ఈ హెల్ప్‌లైన్ సెంటర్ సేవలు ఇకనుంచి అందుబాటులో ఉంటాయన్నారు.



## విపిఆర్‌కి రాఖీ కట్టిన..మోర్ల సుప్రజ

రక్షా బంధన్ సందర్భంగా ఈనెల 11న నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి బుచ్చిరెడ్డిపాళెం ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ రాఖీ కట్టారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకైన రక్షాబంధన్ సందర్భంగా తనకు సోదర సమానులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి రాఖీ కట్టడం చాలా ఆనందంగా ఉందని ఆమె అన్నారు. నెల్లూరు నగరంలోని మాగుంట లేఔట్‌లో ఉన్న విపిఆర్ నివాసంలో ఆమె విపిఆర్‌కి రాఖీ కట్టి ఆయన నుంచి ఆశీస్సులందుకున్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం పట్టణ కౌన్సిలర్లు కోటంరెడ్డి లలితారెడ్డి, అందె ప్రత్యూష, తాళ్ల వైష్ణవిలు కూడా పాల్గొని విపిఆర్‌కి రాఖీలు కట్టారు.

## రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

### వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి



రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా నాయి బ్రాహ్మణులను గుర్తించి వారికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించడం హర్షణీయమని టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఈనెల 12న జిల్లా నాయి బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులోని నర్తకి సెంటర్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి ఆయన పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా, కూటమి ప్రభుత్వ ప్రజలకు అందిస్తున్న పథకాలను ఆయన వివరిస్తూ, ముఖ్యంగా నాయి బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ అందించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణుల సంఘం నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్‌సిసి పట్ల..విద్యార్థులకు అవగాహన



నెల్లూరు నగరంలోని వివేకానంద కాలేజీలో విద్యార్థులకు ఇటీవల ఎన్‌సిసిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎన్‌సిసిలో చేరితే దేశభక్తి పెరుగుతుందని, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని, ఆత్మవిశ్వాసం మరియు క్రమశిక్షణ కూడా పెంపొందడం జరుగుతుందని లీడింగ్ క్యాడెట్ షేక్ అమీర్ తెలిపారు. అదేవిధంగా శారీరక దృఢత్వం కూడా మెరుగుపడుతుందన్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా ఎన్‌సిసి తీర్చిదిద్దుతుందని, విద్యార్థులు భవిష్యత్తులో ఆర్మీ, నేవీ, సైనిక దళాల్లో చేరడానికి కూడా ఎన్‌సిసి ఉపయోగపడుతుందని చెప్పారు.




# నెల్లూరు కబుర్లు

### రాజరాజేశ్వరిదేవి ఆలయంలో..

## భక్తులకు తాంబూలాలిచ్చిన ప్రశాంతమ్మ



వరలక్ష్మీ వ్రతం సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అనంతరం 1,116 మంది మహిళా భక్తులకు తాంబూలాలు అందజేశారు. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చేతులమీదుగా ఆ ప్రసాదాలను అందుకోవడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## 16న..'ఇస్కాన్'లో కృష్ణాష్టమి వేడుకలు



ఈనెల 16న శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో పెద్దఎత్తున పూజలు, భజనలు జరుగనున్నాయి. ఆరోజు వేకువన 4.30 గంటలకు స్మారిక (సావనీర్) ఆవిష్కరణ, స్వామివారికి అభిషేక మహోత్సవం ఉంటాయి. మధ్యాహ్నం 1గంట వరకు ఊయలలో బాలకృష్ణుని కొలువుంచి కీర్తనలను గానం చేస్తారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఈ వేడుకలు నిర్వహించి స్వామివార్లకు మహా ఆరతి, 108 వంటకాలతో నివేదన ఉంటాయి. ఆ తర్వాత, భక్తులందరికీ శ్రీకృష్ణజన్మాష్టమి మహాప్రసాదాన్ని పంపిణీ చేస్తారు. బాలబాలికలకు ఈనెల 3న నిర్వహించిన పాటలు, శ్లోక ఉచ్చారణ, చిత్రలేఖనం, దేవతామూర్తుల వేషధారణ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులిస్తారు. ఈ సందర్భంగా స్వామివారి కలశాభిషేకానికి దాతలైన దంపతులకు జ్ఞాపికతో పాటు, శ్రీకృష్ణ జన్మాష్టమి స్మారిక, మహాప్రసాదం అందజేస్తామని, పురుషులు పంచకట్టుతో, సంప్రదాయదుస్తులతో రావాలని అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) మందిరం నిర్వాహకులు సూచించారు. అదేవిధంగా, ఆగస్టు 17న శ్రీల ప్రభుపాద వ్యాసపూజ, 31వ తేదీన రాధాష్టమి పండుగలను పురస్కరించుకుని మందిరంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకలకు తరలివచ్చి స్వామివార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

## జిల్లాస్థాయి యోగాసన పోటీలు



సింహపురి యోగాసన-స్పోర్ట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 10న నెల్లూరులో 5వ జిల్లాస్థాయి యోగాసనాల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అన్ని వయసుల స్త్రీ పురుషులు పాల్గొన్నారు. మొత్తం 75 మంది యోగ సాధకులు, శిక్షకులు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినవారికి సెంట్రల్ సీఐఓ. ఏ.నాగేశ్వర రావు చేతులమీదుగా పతకాలు, ప్రశంసాపత్రాలు బహూకరించి ఘనంగా సన్మానించారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, ఓవెల్ స్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.బాలు తదితరులు పాల్గొన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ పెంచలయ్య మాట్లాడుతూ, ఈ పోటీల్లో విజేతలైనవారికి రాష్ట్ర స్థాయిలో పోటీ చేసేందుకు అవకాశం వస్తుందన్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జి.అనిల్, డివిజనల్ సెక్రటరీ డివిజన్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం రవీంద్ర, కమిటీ సభ్యురాలు పి.పద్మావతి పర్యవేక్షించారు.

## రంగనాథస్వామి ఆలయ ఘాట్‌ను ఆధునీకరిస్తాం

### మంత్రి నారాయణ స్పష్టీకరణ



నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రంగనాథ స్వామి దేవాలయ ఘాట్‌ను త్వరలోనే ఆధునీకరిస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన రంగనాథస్వామి దేవాలయాన్ని సందర్శించి, ఘాట్ ఏర్పాటుకు సంబంధించిన పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని ప్రాథమిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. పెన్నానది చెంత ఉన్న పార్కులో బోట్ షికార్‌తో పాటు వాటర్ స్పోర్ట్స్‌ని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వచ్చే డిసెంబరు నెలాఖరుకల్లా ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండే విధంగా రంగనాయకుల స్వామి గుడిలో అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నెల్లూరు నగరంలో డ్రైనేజీ మరియు త్రాగునీటి పనులకు రూ.165 కోట్లను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, రెవెన్యూ డివిజనల్ అధికారి అనూష, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లపై మువ్వన్నెల జెండాను ఎగరేయాలి




జిల్లాలోని ప్రజలందరూ దేశభక్తి ఉప్పొంగేలా 'హర్ ఘర్ తిరంగా-హర్ ఘర్ స్వచ్ఛత' కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ పిలుపునిచ్చారు. ఈనెల 11న నెల్లూరు నగరంలోని విఆర్‌సి మైదానంలో, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని జేసీ ప్రారంభించారు. గాంధీ బొమ్మ వరకు ర్యాలీగా వెళ్లి, దేశం కోసం అందరూ తమవంతు కృషిచేయాలని నినాదాలు చేశారు. దేశ రక్షణ ఎంత ముఖ్యమో.. దేశ పరిశుభ్రత కూడా అంతే ముఖ్యమని జేసీ చెప్పారు. మన జాతీయ జెండాను గౌరవించుకుంటూ, మనదేశాన్ని శుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛమైన భారత దేశాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు. 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా-హర్ ఘర్ స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలందరూ తమ ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండాను ఎగరవేసి, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛ భారతదేశం కోసం కృషిచేయాలని చెప్పారు. జడ్పీ సీఇఓ మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధులకు నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరులోని వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ జె. వసుంధర 79వ జన్మదినోత్సవం సందర్భంగా ఇటీవల స్థానిక తల్పగిరి కాలనీలోని స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్ వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను తమ వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వసుంధరతో పాటు, డాక్టర్ జె. అశోక్, ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ సెల్ నాయకుడు కుడుముల సుబ్బారావు, ఉపాధ్యాయుడు షేక్ సుభాన్, ఆశ్రమ నిర్వాహకులు ఉమా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## • కలలకి సాకారం.. ప్రగతికి ప్రాకారం!

# శ్రీ సిటీ ఇంట.. సిరుల పంట!

**ఓ యువ పారిశ్రామికవేత్త కలలు సాకారమయ్యాయి. ఆయన ఆలోచనలకి ఆకారం ఏర్పడింది. 31 దేశాల నుండి 45వేల కోట్ల పెట్టుబడులు మన దేశానికి, మన రాష్ట్రానికి, మన జిల్లా సరిహద్దులకి తరలివచ్చాయి. ఇప్పటికే 240 కర్మాగారాలు ఒకే ప్రాంగణంలో ఆవిర్భవించి 65వేల మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. ఇది ఆషామాషీ కాదు. అనన్య సామాన్యం, అనితర సాధ్యం.**

**సరిగ్గా 17 సంవత్సరాల క్రితం మన రాష్ట్రానికి దక్షిణ వైపు, తమిళనాడు సరిహద్దులో పురుడుపోసుకున్న ప్రత్యేక ఆర్థిక మండలి(ఎస్.ఇ.జడ్) శ్రీసిటీ, నేడు దేదీప్యమానంగా వెలిగిపోతోంది. లక్షా 20వేలకుపైగా ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఎదుగుతోంది. 2008 సంవత్సరంలో 8వ నెల 8వ తారీఖున ఆనాటి**





**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత వై.ఎస్.రాజశేఖరరెడ్డి చేతులమీదుగా ప్రాణం పోసుకుని, ఆయన ఆశయసాధన దిశగా, దేశ పారిశ్రామిక రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది శ్రీసిటీ. సంస్థ రూపకర్త రవీంద్ర సన్నారెడ్డి కలల సౌధంగా, దిన దిన ప్రవర్ధమానమై వందలాది పరిశ్రమలకి నిలయమై ప్రగతి పథంలో దూసుకుపోతోంది శ్రీసిటీ. తడ, సూళ్లూరుపేట ప్రాంతాల జనజీవన సరళిని, వారి స్థితిగతులను మార్చే విధంగా ప్రభావితం చేసిన పారిశ్రామిక మహానగరం శ్రీసిటీ.**

**ఆ శ్రీసిటీకి పదిహేడేళ్ళు. బీడు భూములు పారిశ్రామికవాడగా మారి పదిహేడేళ్ళు. యువ పారిశ్రామికవేత్త రవీంద్ర సన్నారెడ్డి కలల సాకారానికి శ్రీకారం చుట్టి పదిహేడేళ్ళు పూర్తయ్యాయి.**

చుట్టూతా కళకళలాడే రమణీయమైన ప్రకృతి అందచందాలు, విశాలమైన అధునాతన భవనాలు, ఎన్ని పరిశ్రమలున్నా కాలుష్యమన్నదే లేకుండా కట్టుదిట్టమైన చర్యలతో, దేశంలోని పెద్దపెద్ద నగరాల్లోని పారిశ్రామిక కేంద్రాల్లోకెల్లా అగ్రగామిగా, వందలాది పరిశ్రమలకు ఆలవాలంగా వెలసి వర్థిల్లుతోంది..శ్రీసిటీ. దేశంలోనే కనీవినీ ఎరుగని విధంగా, ఓ వెనుకబడిన ప్రాంతాన్ని అత్యద్భుతమైన పారిశ్రామిక ప్రాంగణంగా తీర్చిదిద్దడమే కాక, తమ ప్రతిభాపాటవాలతో దానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన ఘనత శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిది. పరిశ్రమల రంగంలోనే అద్వితీయమైన విజయాలెన్నో సాధిస్తూ, ఆగస్టు 8వ తేదీ నాటికి శ్రీసిటీ తన పదిహేడేళ్ళ ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం నిజంగా అపూర్వమే. ఒక్క పరిశ్రమ పెట్టాలంటేనే పారిశ్రామికవేత్తలకు చుక్కలు కనిపించే నేటి పరిస్థితుల్లో, ప్రపంచంలోని 31 దేశాలకు చెందిన 240 ప్రఖ్యాత కంపెనీలకు శ్రీసిటీ పుట్టినిల్లు కావడం, అందులోనూ 35 జపాన్ కంపెనీల ఏర్పాటుతో, దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ కంపెనీలకు కేంద్రబిందువుగా మారడం శ్రీసిటీ విజయ ప్రస్థానంలో గొప్ప మైలురాళ్ళనే చెప్పవచ్చు. సుమారు 45వేల కోట్ల పెట్టుబడులతో, 65వేల కోట్లకు పైగా ఎగుమతులతో రాణిస్తూ, దాదాపు 65వేల మందికి ఉపాధి కలిగించడం, వారిలో సగానికి పైగానే ఉద్యోగ కార్మికులు మహిళలు కావడం శ్రీసిటీ సాధించిన మరోవిజయం. ఒక్కమాటలో చెప్పాలంటే పరిశ్రమల రంగంలో భారత కీర్తిపతాకాన్ని ఎగరవేస్తూ, "మేక్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్" నినాదానికి ప్రతిబింబంగా, భారత ప్రధాని ఆశయమైన 'ఆత్మనిర్భర భారత్'కు కార్యరూపంగా, మొత్తంగా పారిశ్రామికరంగానికే స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.. శ్రీసిటీ. అందుకే, శ్రీసిటీ ప్రపంచ పటంలో తనదంటూ ఒక ప్రత్యేకస్థానం సాధించుకుంది.

### ఎన్నో పరిశ్రమలు.. ఎన్నెన్నో రకాల ఉత్పత్తులు :

టూత్ బ్రష్‌ల నుండి ఆటోమొబైల్స్ వరకు, స్టీల్ ఫాస్టెనర్‌ల నుండి మెట్రో కోచ్‌ల వరకు, ఫుడ్ ప్రాసెసింగ్ నుండి ఎయిర్ కండిషనర్‌ల వరకు శ్రీసిటీలో ఎన్నో పరిశ్రమలు ఎన్నెన్నో రకాల ఉత్పత్తులను ప్రజలకు అందిస్తున్నాయి. కోల్గేట్, మోండెలెజ్, డైకిన్, ఆల్‌స్టామ్, కెల్లాగ్స్, ఇసుజు, కింబర్లీ–క్లార్క్ వంటి గ్లోబల్ సంస్థలు దేశీయ మార్కెట్‌లకు అవసరమైన ఉత్పత్తులను ఇక్కడ తయారుచేసి, ప్రపంచంలోని 60కి పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నాయంటే, శ్రీసిటీలోని పరిశ్రమల ఖ్యాతి ఎంతగా విస్తరించిందో అర్థం చేసుకోవచ్చు. ఎయిర్ కండిషనర్ల తయారీలోనూ నెంబర్–1గా ఉంటూ, అన్ని ప్రధాన కంపెనీల తయారీదారులు ఇక్కడ పరిశ్రమలు పెట్టారంటే.. శ్రీసిటీలోని పారిశ్రామిక అనుకూల వాతావరణం ప్రపంచప్రఖ్యాత పారిశ్రామికవేత్తలను ఎంతగా ఆకట్టుకుంటుందో ఊహించుకోవచ్చు. శ్రీసిటీ ద్వారా ఆంధ్రప్రదేశ్ తయారీ రంగం ఆర్థికంగా బలపడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కితాబిచ్చారంటే శ్రీసిటీ ప్రగతి ప్రయాణం ఎంత విశిష్టమైనదో తేటతెల్లమవుతుంది. పపంచంలోని అత్యుత్తమ పారిశ్రామిక నమూనాలలో ఒకటిగా శ్రీసిటీని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసించారు కూడా. అంతేకాదు, జపాన్, రష్యా, యుకె, బెల్జియం తదితర విదేశీ దౌత్యవేత్తలు సైతం శ్రీసిటీ పారిశ్రామిక సామర్థ్యం సాటిలేనిదని కొనియాడారు.

స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్, కోపెన్‌హాగన్ బిజినెస్ స్కూల్ మరియు భారత దేశంలోని ఐఏఎస్ శిక్షణ అకాడమీలు వంటి ప్రముఖ సంస్థలు శ్రీసిటీని భవిష్యత్తు అభివృద్ధికి ఒక ప్రామాణికంగా గుర్తించాయి. స్వర్ణ ఆంధ్రప్రదేశ్ విజన్–2047లో భాగంగా ఆర్థిక అభివృద్ధిపై ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ రాష్ట్రవ్యాప్తంగా శ్రీసిటీ మోడల్‌ను అనుసరించాలని గట్టిగా సిఫార్సు చేయడం గమనార్హం.

### సామాజిక సేవలోనూ ముందంజ...

పారిశ్రామిక కార్యకలాపాలతో పాటు శ్రీసిటీ పరిసర ప్రాంతాల సామాజిక ఆర్థికాభివృద్ధిలోను శ్రీసిటీ పాత్ర ఎంతో కీలకంగా ఉంటోంది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా వివిధ పరిశ్రమల భాగస్వామ్యంతో, శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్య సేవలు, మౌళిక సదుపాయాలు, వారికి జీవనోపాధి కల్పించడం వంటి సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు ఈ 17ఏళ్ళుగా శ్రీసిటీ ఎంతో నిబద్ధతతో కొనసాగిస్తూనే ఉంది. శ్రీసిటీ 17వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుని ఈనెల 8న తిరుపతి ఎన్టీఆర్ ట్రస్ట్‌తో కలసి శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించడం, పలు పరిశ్రమల ఉద్యోగులు, విద్యార్థులు ఇందులో రక్తదానం చేయడం శ్రీసిటీ సామాజిక సేవాభావానికి నిదర్శనం.

### ప్రగతి దిశగా..ముందుకు, మున్ముందుకు

పుట్టినగడ్డకు ఏదైనా మేలు చేయాలన్న బలమైన ఆలోచనల్లోంచే 'శ్రీసిటీ' పురుడు పోసుకుంది. ఇప్పుడు శ్రీసిటీ ప్రపంచప్రఖ్యాత పారిశ్రామికవాడగా పేరు పొందడం, శ్రీసిటీ ఆవిర్భవించి 17 ఏళ్ళు పూర్తికావడం ఎంతో సంతోషంగా వుంది. పరిశ్రమలు, ప్రజలకు ఉపాధి కల్పనతో పాటు సామాజిక సదుపాయాల కల్పనకు శ్రీసిటీ తనవంతు కృషిని నిరంతరం కొనసాగిస్తుంది. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం, వారి సహకారంతో భవిష్యత్తులో కూడా శ్రీసిటీ సుస్థిర ప్రగతి దిశగా మరింత ముందుకు.. మున్ముందుకు నడుస్తుంది.



డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి
**వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్**

# అద్భుత శిల్పకళకు సజీవ సాక్ష్యాలు..మన ప్రాచీన ఆలయాలు

## • నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



అద్భుతమైన శిల్పకళకు మన ప్రాచీన ఆలయాలు సజీవ సాక్ష్యాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్), ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల వారు ఉదయగిరిలోని ప్రాచీన రంగనాయకులస్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, మన ప్రాచీన ఆలయాలు భారతీయ సాంస్కృతిక వైభవానికి అద్దం పడతాయన్నారు. హిందూ సమాజాన్ని ఏకం చేయడమే లక్ష్యంగా శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో తొలిసారిగా శ్రీనివాస కళ్యాణోత్సవం నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ వారి కృషిని ఆయన అభినందించారు. సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో విశ్వహిందూ పరిషత్ కృషి అమోఘమన్నారు. విజయనగర రాజులైన రాయలవారి పాలనలో ఉదయగిరి ప్రాంతం 365 ఆలయాలతో నిత్య కళ్యాణం పచ్చ తోరణంలా, గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిందన్నారు. ఉదయగిరి ప్రాంతాన్ని పర్యాటక ఆధ్యాత్మిక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు తమవంతు ప్రయత్నిస్తామన్నారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, సుమారు 600 ఏళ్ల క్రితం శ్రీకృష్ణదేవరాయల వారు నిర్మించిన శ్రీ రంగనాథ స్వామి ఆలయం మన ప్రాచీన శిల్పకళా వైభవానికి ప్రతిరూపమన్నారు. ఆ శ్రీనివాసుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

### ఘటిక సిద్ధేశ్వరస్వామి సేవలో...

నెల్లూరు జిల్లాలో ఉన్న అత్యంత పురాతన పుణ్యక్షేత్రం శ్రీ ఘటిక సిద్ధేశ్వరస్వామి–ఇష్టకామేశ్వరీ దేవి అమ్మవారి ఆలయాన్ని ఇటీవల వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించారు.



## పీఎం ఇంటర్న్‌షిప్
# పథకం స్థితిగతులేమిటి?
### లోక్‌సభలో విపిఆర్ ప్రశ్నలు



దేశంలో ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ స్కీమ్ అమలు స్థితిగతులను తెలియజేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు. ఇటీవల లోక్‌సభలో ఆయన ఈ పథకం అమలుపై పలు ప్రశ్నలు వేశారు. టాప్ 500 కంటే ఎక్కువ కంపెనీలు ఈ పథకంలో పాల్గొనడానికి ఆసక్తి చూపుతున్నాయనేది నిజమేనా అని ఆరాతీశారు. ఇందులో ఏమైనా సవరణలు ఉంటే తెలపాలన్నారు. ఈ విషయంలో సిఐఐ, ఎఫ్‌సిసిఐ, ఇతర పరిశ్రమ సంస్థలు ప్రభుత్వానికి సహకరిస్తున్న అంశం తెలియజేయాలని కోరారు. అందుకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రోడ్డు రవాణా మరియు హైవేల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం 2024-25 బడ్జెట్‌లో ప్రకటించబడిందని, ఐదు సంవత్సరాలలో టాప్ 500 కంపెనీలలో కోటిమంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం దీని లక్ష్యమన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద సంవత్సరంలో యువతకు 1.25 లక్షల ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

జనవరి 9, 2025న ప్రారంభమైన ఈ పథకంలో, రెండో దశలో దాదాపు 327 భాగస్వామి కంపెనీలు దేశంలోని 735 జిల్లాల్లో 1.18 లక్షలకు పైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలను పోస్ట్ చేశాయని తెలిపారు. 2.14 లక్షలకుపైగా దరఖాస్తుదారుల నుండి 4.55 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయని, ఆగస్టు 6వ తేదీ నాటికి, భాగస్వామి కంపెనీలు యువతకు 78,500 కంటే ఎక్కువ ఆఫర్‌లను అందించాయన్నారు. ఈ దశలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కంపెనీలు 4,700కిపైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలను పోస్ట్ చేస్తే అభ్యర్థులకు 10వేలకిపైగా ఆఫర్‌లను కంపెనీలు అందించాయని, ప్రస్తుతం, ఆఫర్‌లను అమలు చేసే ప్రక్రియ పురోగతిలో ఉందని చెప్పారు.

### పీఎం జన్‌మన్ కింద ఏపీలో 87 హాస్టళ్లు

ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 87 హాస్టళ్లను కేటాయించినట్లు కేంద్ర విద్యాశాఖా సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. ఈనెల 11న లోకసభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో పథకం అమలు స్థితిపై విపిఆర్ పలు ప్రశ్నలు వేశారు. ప్రాజెక్టుల సమయం, ఖర్చు పెరుగుదల, గడువు వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్(పిఎం జన్‌మన్) అనేది గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యక్రమం అని చెప్పారు. ఈ పథకం అమలులో భాగంగా సమగ్ర శిక్ష కింద 500 హాస్టళ్ల నిర్మాణానికి విద్యా మంత్రిత్వ శాఖ కార్యాచరణను అమలు చేస్తోందన్నారు. 2023-24 నుండి, 17 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో పీఎం జన్‌మన్ కింద 492 హాస్టళ్లు ఆమోదించబడ్డాయని వివరించారు.

## డ్రోన్ సాయంతో..బాలుడు దొరికాడు



తల్లితండ్రులు తిట్టారని అలిగి ఇంట్లోంచి వెళ్లిపోయిన ఒకటోతరగతి బాలుడిని ఎట్టకేలకు డ్రోన్ సాయంతో పోలీసులు గుర్తించి, క్షేమంగా తల్లితండ్రులకు అప్పగించారు. ఈనెల 11న నెల్లూరు రూరల్‌లోని పాతవెల్లంటి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఆ గ్రామంలోని నారాయణ-రమణమ్మల కుమారుడైన మనోజ్, అల్లరిచేస్తున్నాడని తల్లితండ్రులు మందలించడంతో ఎక్కడికో వెళ్లిపోయాడు. ఎంతగా వెదికినా కనిపించకపోయేసరికి ఆ తల్లితండ్రులు ఆందోళనతో పోలీసులను ఆశ్రయించగా, సీఐ జి.వేణు, పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి, ఓ మిద్దెమీద ఉన్న మనోజ్‌ను డ్రోన్ సాయంతో గుర్తించి, తల్లితండ్రుల వద్దకు చేర్చడంతో, కథ సుఖాంతమైంది.

# పాక్‌కి వంత పాడుతున్న అమెరికా




భారత్‌పై నిత్యం అక్కసు వెళ్లగక్కే పాకిస్థాన్‌కి ఇప్పుడు అమెరికా అండ దొరికింది. తాజాగా పాకిస్థాన్‌కి మద్దతు పలకడం ద్వారా అమెరికా తన రంగు మరోసారి బయట పెట్టుకుంది. అమెరికా గడ్డపై పాకిస్థాన్ ఆర్మీ అధిపతి అసిఫ్ మునీర్ భారత్‌ను బెదిరిస్తూ వ్యాఖ్యలు చేయటం, దానికి ప్రతిస్పందనగా అమెరికా సన్నాయి నొక్కులు నొక్కటం చూస్తుంటే ఆ రెండు దేశాల సహజ మైత్రి ఎవరికైనా అర్థమవుతుంది. భారత్‌ను ఒకవైపు తమకు విశ్వసనీయమైన, వ్యూహాత్మక భాగస్వామి అంటూనే మరోవైపు భారతదేశానికి నిత్యం చికాకులు పెట్టడానికి ప్రయత్నించే పాకిస్థాన్‌కి వంత పాడుతోంది.

ఇటీవల పాకిస్థాన్ సైనిక అధ్యక్షుడు ఆసిఫ్ మునీర్ అమెరికాలో అధికారిక పర్యటనకు వెళ్ళినప్పుడు పాకిస్థాన్ కమ్యూనిటీని ఉద్దేశించి మాట్లాడుతూ భారత్‌పై పిచ్చి ప్రేలాపనలు పేలారు. 'భారత్ నుంచి ముప్పు ఎదురైతే తమ దేశం సగం ప్రపంచాన్ని నాశనం చేస్తుందని' ఆసిమ్ మునీర్ అన్నారు. తమది ఒక అణ్వస్త్ర దేశమని, తాము పతనమవుతామని అనిపిస్తే తమతో పాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామని అన్నారు. అదిగో అణ్వస్త్రం తయారు చేస్తున్నారు అంటూ ప్రపంచంలోని అన్ని దేశాలను బెదిరించే అమెరికా, తమ దేశం నడిబొడ్డు నుంచి మరో దేశం సైన్యాధ్యక్షుడు అణ్వస్త్ర బెదిరింపులకు దిగినా.. ఇదేమని మాటవరసకైనా ప్రశ్నించలేదు.

'ఆపరేషన్ సిందూర్' తర్వాత ట్రంప్‌తో భేటీ అయిన మునీర్, కేవలం రెండు నెలల వ్యవధిలో మరోసారి అక్కడకు వెళ్లారు. భారతదేశానికి వ్యతిరేకంగా అమెరికాతో వ్యూహాత్మక సంబంధాలు బలోపేతం చేసుకోవడం పాకిస్థాన్ లక్ష్యంగా కనబడుతోంది. 'ఆపరేషన్ సిందూర్'లో చైనా అభివృద్ధి చేసి ఇచ్చిన రక్షణ సామాగ్రి ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వకపోవడంతో పాకిస్థాన్ దిక్కుతోచక అమెరికాను ఆశ్రయిస్తున్నట్టు కనబడుతోంది. తనకు వ్యాపారం అవుతున్నప్పుడు అమెరికా కూడా వద్దు అనదు కదా! అందులోనూ భారత్ సైనిక పరంగా బలోపేతం అవుతున్నట్టు అమెరికా కూడా గమనిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా గత అనుభవాలను బట్టి చూస్తే ఏ దేశమూ బలంగా ఎదగటాన్ని అమెరికా సహించదు. నేరుగా రంగంలోకి దిగకుండా పొగపెట్టడానికి ప్రయత్నిస్తుంది. కొన్ని దశాబ్దాల పాటు అమెరికా పాకిస్థాన్‌కి అండగా నిలుస్తూ భారత్‌కు పొగపెడుతూ వచ్చింది. గడిచిన రెండు దశాబ్దాలుగా మాత్రమే భారత్‌తో వ్యూహాత్మక సంబంధాలను ఏర్పరచుకుంది. అందులోనూ గడచిన దశాబ్ద కాలంలో ఈ సంబంధాలు మరింత బలపడ్డాయి. అయితే ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యాలు మారాయి. పాక్‌లోని వేర్పాటువాద సంస్థ బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ-BLA)పై పాకిస్థాన్ అడగటం ఆలస్యం ఉగ్రవాద ముద్ర వేసింది.

ఈ పరిణామాలను కలిపి చూస్తే, అమెరికా తన దక్షిణాసియా వ్యూహాన్ని పునర్మూల్యాంకనం చేస్తోందనే సంకేతాలు కనబడుతున్నాయి. గతంలోలాగే అమెరికా మళ్లీ పాకిస్థాన్‌ని ప్రాంతీయ వ్యూహాలకు కీలక బిందువుగా చూస్తోందనే భావనను బలపరుస్తోంది. అమెరికా మాటల్లో తటస్థత ఉన్నా, ఆచరణలో మాత్రం పాకిస్థాన్ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని అర్థమవుతుంది. ఒకవైపు పాకిస్థాన్‌కి కవచంగా వుంటూ, మరోవైపు భారత్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచుతోంది.

### భారత్ వైఖరి ఏమిటి?

ఇరు దేశాలు గడచిన రెండు దశాబ్దాలుగా పలు కీలక రక్షణ ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఇవన్నీ పరస్పర విశ్వాసంతో చేసుకున్న ఒప్పందాలు. అయితే తాజాగా ట్రంప్ సుంకాల భారాన్ని మోపటం, పాకిస్థాన్‌కి వంత పాడటం చూస్తుంటే పరస్పర విశ్వాసం పునాదిగా కుదిరిన అమెరికా, భారత్ రక్షణ ఒప్పందాల భవితవ్యం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. ఈ ఏడాది చివర్లో భారత్‌లో క్వాడ్ నేతల సదస్సు జరగాల్సి ఉంది. ప్రస్తుత ప్రతికూల వాతావరణం కారణంగా ఆ సమావేశం వాయిదా పడే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఆర్థిక, దౌత్య విభేదాలు రక్షణ సహకారాన్ని దెబ్బతీయలేదు. కానీ, ఈసారి ట్రంప్ వాణిజ్య పోరును ప్రతీకార దృష్టితో నడుపుతున్నట్లు కనిపిస్తోంది. ట్రంప్... రక్షణ సహకారాన్ని వాణిజ్య, దౌత్య సదలింపులకు మారకంగా ఉపయోగించే ప్రమాదం ఉంది. పాకిస్థాన్‌కి సమాన స్థాయిలో ఆయుధాలను అందించడం ద్వారా భారత్‌పై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం దశాబ్దాల కృషితో ఏర్పడింది. కానీ ట్రంప్ ప్రతీకార ధోరణి వల్ల అది దెబ్బతినే ప్రమాదం ఉంది.

ప్రస్తుతం ఇరుదేశాల రక్షణ వ్యూహకర్తలు పరస్పర పరిపక్వత చూపించి, రక్షణ సహకారాన్ని వాణిజ్య తగాదాల నుంచి దూరంగా ఉంచాలి. దీర్ఘకాల వ్యూహాత్మక సంబంధాల పునర్నిర్మాణానికి రక్షణ భాగస్వామ్యం మూలస్తంభంగా ఉండాలి. ఇప్పటికైనా రక్షణ ఒప్పందాలను ఈ సుంకాల పోరులోకి లాగరాదు.

భారత్ ఇప్పటివరకు తన స్పందనలో ఎంతో పరిపక్వతను ప్రదర్శించింది. సుంకాల విషయంలో ఇతర దేశాధినేతల మాదిరిగా ట్రంప్‌ను మళ్లీ ఆలోచించమని మోడీ కోరలేదు. గతంలోనూ పాకిస్థాన్‌ని అడ్డం పెట్టుకుని భారత్‌ను ఎదగకుండా చేయాలని ప్రయత్నించినా మన సంకల్పబలంతోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాం. రక్షణ, అంతరిక్ష రంగాల్లో స్వయంసమృద్ధి దిశగా సాగిపోతున్నాం. అడ్డంకులు సృష్టించిన కొద్దీ వేగంగా బలంగా దూసుకుపోతున్నాం. ఇకముందు కూడా జరిగేదదే. కాకపోతే కొన్ని దేశాల కురుచ బుద్ధులు బయటపడతాయి. అంతకుమించి ఏమీకాదు.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




### నెల్లూరులో ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ, ఈనెల 12న నెల్లూరులో (నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండులో జరిగిన ఈ ఆందోళనలో, యూనియన్ జిల్లా కార్యదర్శి మురళీ మోహన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం వేతన సవరణ కమిటీని నియమించాలని, మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను ఇకనైనా భర్తీచేయాలని కోరారు.

### విద్యార్థిని మృతిపై ధర్నాందోళన

నెల్లూరులోని ఇస్కాన్‌సిటీ వద్దనున్న ఓ కళాశాల విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలంటూ ఈనెల 11న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాలు ధర్నా చేశాయి. ఆ సంఘాల నాయకులు మాట్లాడుతూ, గతంలో కూడా ఈ కళాశాలలో విద్యార్థుల ఆత్మహత్యలు జరిగాయని, అయినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆ విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. ఈ ఆందోళనలో ఎస్ఎఫ్ఐ, నాయకులు విక్రమ్, నరేంద్ర, డివైఎఫ్ఐ నాయకులు నరసింహ, ఎంవి రమణ, ఐద్వా నాయకురాళ్ళు మస్తాన్‌బీ, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టరేట్ వద్ద ఆటోకార్మికుల ధర్నా

రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ప్రభుత్వం అనుమతిస్తున్న నేపథ్యంలో, తమకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఈనెల 11న ఆటోకార్మికులు ధర్నాందోళన చేశారు. జిల్లా ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌వి రాజా, కె.సురేష్ మాట్లాడుతూ, ఉన్నత చదువులు చదువుకున్నా ఉద్యోగాలు లేక బ్యాంకుల్లో అప్పులు తీసుకుని ఆటోలు నడుపుకుంటూ ఎందరో ఆటో కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం వాహనమిత్ర కార్యక్రమం కింద ఏటా పాతికవేల రూపాయలు అందజేయాలని కోరారు. ఆటోకార్మికుల సమస్యలను పరిష్కరించి, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి ఆదుకోవాలన్నారు. అనంతరం, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్న జాయింట్ కలెక్టర్‌కి అందజేశారు.

### కందుకూరులో అధ్యాపకుల నిరసన

గత ప్రభుత్వం జారీచేసిన జీఓ నం.42ని రద్దుచేయాలని కోరుతూ కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) అధ్యాపకులు ఈనెల11న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. తమకి కూడా వెంటనే బదిలీలు నిర్వహించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో వలె అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్లుగా తమను రీ-డిజిగ్నేట్ చేయాలని, అధ్యాపకుల సమస్యలన్నిటినీ పరిశీలించి పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అధ్యాపక సంఘం నాయకులు డా.పి.రాజగోపాల్, డా.ఎన్ తిరుపతి స్వామి, బి. కమలబాబు, డా.ఎన్‌వి శ్రీహరి, డా. ఏడుకొండల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### స్మార్ట్ మీటర్లపై సీపీఎం నిరసన గళం

స్మార్ట్‌మీటర్లపై నిరసన వ్యక్తంచేస్తూ ఈనెల 10న తోటపల్లి గూడూరు మండలంలోని మహాలక్ష్మిసెంటర్‌లో వెంకన్నపాలెం సీపీఎం శాఖ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. సీపీఎం జిల్లాకమిటీ సభ్యురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, పలువురు సీఐటియు నాయకులు మాట్లాడుతూ, స్మార్ట్‌మీటర్ల వల్ల అదనపు భారాన్ని ప్రజలు భరించలేకపోతున్నారని అన్నారు. నాయకులు ఎం.రాధయ్య, సునీల్, రామసుబ్బయ్య, ప్రవంత్, లెనిన్, శీనయ్య పాల్గొన్నారు.



# 18 నుంచి గొలగమూడిలో..
# శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

## • 23న గరుడసేవ, 24న ఆరాధన - తెప్పోత్సవాలు

'ఆకలై కొంగుపట్టే వారికి అన్నం పెట్టాలయ్యా-ఆపదల్లో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా' అంటూ మానవాళికి మానవతా విలువలను ప్రబోధం గావించిన కరుణామూర్తి.. భక్తజన బాంధవుడు.. నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని గొలగమూడి గ్రామంలో కొలువై ఉన్న అవధూత.. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 18 నుంచి అంగ రంగ వైభవంగా ప్రారంభం కాబోతున్నాయి. ఈనెల 24వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు జిల్లానుంచే కాక, ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి కూడా లక్షలాదిగా భక్తులు తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆశ్రమ కమిటీ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరాధనోత్సవాల రోజుల్లో ప్రతిరోజూ వేకువన 2 గంటల నుంచి పూజలు అభిషేకాలు జరుగుతాయి. స్వామివారు అవధూత కనుక దత్త సంప్రదాయ రీతిలో షోడశోపచార పూజలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ వివిధ వాహనాల్లో స్వామివారి ఊరేగింపులతో గొలగమూడి భక్తజన కోలాహలంతో నిండిపోతుంది.

### కన్నులపండువగా వాహనసేవలు :

ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు గొలగమూడి గ్రామస్తులు ఉభయకర్తలుగా ఉండి సర్వభూపాల వాహనం, రాత్రి 10 గంటలకు కల్పవృక్ష వాహనసేవలను కన్నులపండువగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుంది. అదేవిధంగా, 19వ తేదీ ఉదయం 10 గంటలకు సూర్యప్రభ, రాత్రి 9 గంటలకు చంద్రప్రభ వాహనసేవలు, 20వ తేదీ ఉదయం హనుమంత సేవ, రాత్రికి హంసవాహనసేవలు ఉంటాయి. 21న చినశేష వాహనసేవ, రాత్రి గజవాహనసేవ, 22న అశ్వవాహనం, రాత్రికి పెద శేషవాహనసేవ, 23న సింహవాహనసేవ, రాత్రికి గరుడవాహనసేవ నిర్వహిస్తారు. ఆగస్టు 24న ప్రధానమైన ఆరాధనోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దంపతులు వెంకయ్యస్వామికి సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. 10 గంటలకు వేలాది భక్తజనుల మధ్య రథోత్సవం, రాత్రి 8 గంటలకు తెప్ప మహోత్సవం ఉంటాయి. మధ్యాహ్నం-రాత్రి భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుంది. ఈ ఆరాధనోత్సవాల్లో జరిగే సాంస్కృతిక వేడుకల్లో భాగంగా, శాస్త్రీయ నృత్యాలు, అన్నమాచార్య సంకీర్తనలు, భక్తిగీతాలు, పౌరాణిక నాటకప్రదర్శనలు, కోలాటాలు, భజనలు, నాదస్వర-డోలు వాద్య కచ్చేరీలు ఏర్పాటుచేస్తున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ ఆరాధనోత్సవాల్లో పాల్గొని భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆశ్రమ కమిటీ వారు కోరుతున్నారు.



# శ్రీసిటీలో వేడుకగా..'తిరంగా యాత్ర'

భారత సైనిక దళాల ధైర్యసాహసాలను స్మరించుకుంటూ గత రెండు నెలలుగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'తిరంగా యాత్ర' ఇటీవల శ్రీసిటీలో వేడుకగా సాగింది. ఐఐఐటి-శ్రీసిటీ, క్రియా విశ్వవిద్యాలయం, స్టేషన్-ఎస్, శ్రీసిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. శ్రీసిటీలోని వెస్ట్ ఫార్మా, ఆస్ట్రోటెక్ స్టీల్స్, వెర్మెరెన్, జెన్ లినెన్, సిద్ధార్థ లాజిస్టిక్స్, బ్లెండ్‌హబ్ సంస్థల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో, ఐఐఐటి-శ్రీసిటీ ఆవరణ నుంచి యాత్ర ప్రారంభమై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌వే మీదగా కొబెల్కో కూడలి వరకు కొనసాగి మళ్ళీ వెనక్కు ఐఐఐటి-శ్రీసిటీని చేరుకుంది. విద్యార్థులు, అధ్యాపకులు, శ్రీసిటీ నివాసితులు త్రివర్ణ పతాకాలు చేతపట్టి దేశభక్తితో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. తొలుత, ఐఐఐటి-శ్రీసిటీ మాజీ ఛైర్మన్, స్ట్రాలినిటీ సంస్థ సీఈఓ ఎం.బాలసుబ్రమణ్యం ముఖ్యఅతిథిగా విచ్చేసి, ఈ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. మన స్వేచ్ఛ, సమానత్వానికి గుర్తుగా, ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత సాయుధదళాల ధైర్యం, త్యాగానికి గౌరవంగా ఈ తిరంగాయాత్ర చేశామన్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో, పలు సంస్థలు, పురప్రజలు ఉమ్మడిగా చేపట్టిన ఈ తిరంగాయాత్ర, అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని, దేశం పట్ల శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం చూపుతున్న గౌరవానికి, నిబద్ధతకు ఇదొక నిదర్శనమని తెలిపారు. ఐఐఐటి-శ్రీసిటీ రిజిస్ట్రార్ కల్నల్ టి.ఉమాశంకర్, క్రియా విశ్వవిద్యాలయం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సి.పి.సత్యశరణ్, నోవా ఎయిర్ ప్లాంట్ అధిపతి శ్రీనివాసులురెడ్డి, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# చిరంజీవి జీవితం ఆదర్శనీయం

## ఎమ్మెల్యే సునీల్‌కుమార్



సినీ నటుడు, మెగా స్టార్ చిరంజీవి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచి, కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ తెలిపారు. చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని చిరంజీవి యువత, మెగా బ్రదర్స్ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ రాష్ట్రస్థాయి మెగా పాటల క్వార్టర్‌ఫైనల్స్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిరంజీవి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, ఆయనను ఆదర్శంగా తీసుకొని యువత రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాల చేయడం అభినందనీయమని అన్నారు. ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పోటీలలో గెలుపొందిన వారు తాడేపల్లిగూడెంలో నిర్వహించే సెమీఫైనల్స్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మురళీ, వెంకటేశ్వర్లు, మోహన్, సంజయ్‌బాబు, న్యాయనిర్ణేతలు విజయలక్ష్మి, సారంగం సులక్ష్మీ, సుగంధిని, వసంతకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయనిర్ణేతలలో ఒకరైన ఇసకపల్లి శివప్రసాద్, సీనియర్ జర్నలిస్టు సంఘ నాయకులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.

# స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

## • వామపక్షాల డిమాండ్



విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను ఉపసంహరించుకోవాలంటూ వామపక్ష నాయకులు నినదించారు. ఈ విషయమై ఇటీవల గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు సీపీఎం, సీపీఐ నాయకులు ప్రదర్శన నిర్వహించారు. 'విద్యుత్‌ఛార్జీల నిలువుదోపిడీని ఆపాలి-ప్రమాదకర స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం సమర్పించారు. సి.పి.యం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సి.పి.ఐ జిల్లా కార్యవర్గసభ్యులు సి.హెచ్.ప్రభాకర్, టి.వెంకటరామిరెడ్డి, బి.వి.రమణయ్య, పుట్టా శంకరయ్య, గుర్రం రమణయ్య, ఆర్.శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య, ఏంబేటి చంద్రయ్య, గండికోట మధు, వి.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఎల్‌ఏపి విద్యార్థులకు కౌన్సిలింగ్

చిల్లకూరు, శారదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఇటీవల విద్యార్థులకు మానసిక ఒత్తిడిని తగ్గించి, సులభతరమైన పద్ధతిలో విద్యను బోధించి, వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రముఖ మనస్తత్వవేత్త మరియు కెరియర్ కౌన్సిలర్ అభిషేక్ సింగంశెట్టి ద్వారా కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, వారిలో ఈ మానసిక ఒత్తిడిని తగ్గించి, సులభతరమైన రీతిలో విద్యను బోధించి, వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు అభిషేక్ సింగంశెట్టి ద్వారా ప్రతి నెల పాఠశాలలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

# విద్యార్థులకు 'లయన్స్' స్టడీ కుర్చీలు




గూడూరు పట్టణంలోని పాత బస్టాండు ప్రాంతంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఇటీవల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత లయన్ బయ్యా రవికుమార్ హాజరై లయన్స్ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షుడిగా అక్కన రమణయ్య, కార్యదర్శిగా ఆర్.రవిచంద్ర, కోశాధికారిగా వీరేంద్రనాథ్ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టడీ కుర్చీలు, పేపర్‌బాయ్‌కు సైకిల్ పంపిణీ చేశారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డీఎస్ కుమార్, ఎస్.ఎస్.వి.రామ్మోహన్‌రావు, క్లబ్ డిస్ట్రిక్ఛ్ ఛైర్మెన్ షేక్ రియాజ్‌అహ్మద్, ఆర్.వి.రావు, మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్‌రావు, సోమిశెట్టి చెంచురామయ్య, శీనయ్య, రూపేష్‌రెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తే.. కఠిన చర్యలు

## డీఎస్పీ గీతాకుమారి




గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని గూడూరు డీఎస్పీ గీతాకుమారి చెప్పారు. పట్టణంలోని డివిజన్ పోలీస్ కార్యాలయంలో ఆమె ఇటీవల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఈ క్రమంలో ఇటీవల గూడూరు వన్‌టౌన్‌కు చెందిన ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తుండగా అరెస్టు చేశామని, అదేవిధంగా హాస్పిటల్ రోడ్డులో ఒక దుకాణం గొడవ నేపథ్యంలో దుకాణంలో ఉన్న వ్యక్తిని ఇబ్బంది పెట్టాలని నయీం అనే యువకుడు సుమారు 600 గ్రాముల గంజాయి పొట్లాలను దుకాణంలో ఉంచి గంజాయి మెడికల్‌షాప్‌లో విక్రయిస్తున్నట్లు ప్రచారం చేశారని, తమ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విచారించిన అనంతరం నయీం ఉద్దేశపూర్వకంగా ఆ పని చేశాడని రూఢీఐందని, అతనిని అదుపులోకి తీసుకొని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నా లేదా సేవిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే, సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకటవ పట్టణ సీఐ శేఖర్‌బాబు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో పోలీసుల తనిఖీ



గూడూరు పట్టణ సమీపంలోని గాంధీనగర్ టిడ్కో గృహాల్లో పోలీసులు ఇటీవల కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక పనులను నిరోధించే దిశగా పోలీసులు బృందాలుగా ఏర్పడి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువ పత్రాలు లేని 5 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో గూడూరు రూరల్ ఎస్సై మనోజ్‌కుమార్, ఒకటో పట్టణ ఎస్సై తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


# కల్యాణ వైభవం...!

**ఆశ్రిత - అనిరుధ్**



నెల్లూరు వాస్తవ్యులు బండారు సుధాకర్‌రెడ్డి - సుభాషిణిల మనుమరాలు, పొన్నేరి రవికుమార్ - సుజాతల కుమార్తె సాయి ఆశ్రిత - కృష్ణసాయి అనిరుధ్‌రెడ్డిల వివాహం ఆగస్టు 10వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

**తేజశ్విని - ప్రదీప్**



నెల్లూరు వాస్తవ్యులు మోపూరు పెంచలయ్య (అలంకార్) - రాజేశ్వరిల కుమార్తె డాక్టర్ లక్ష్మీసాయి తేజశ్విని - డాక్టర్ సాయి ప్రదీప్ (ఒంగోలు వాస్తవ్యులు వెలుగోటి వెంకటేశ్వరరావు - కళ్యాణి)ల పరిణయం ఆగస్టు 10వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనెలు.



# అమిత్‌షాని కలసిన..మన ఎంపీలు

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాని ఇటీవల ఆంధ్రప్రదేశ్‌కి చెందిన పలువురు ఎంపీలు మర్యాదపూర్వకంగా కలుసుకుని, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మన జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) కూడా ఉన్నారు.

# ఎట్టకేలకు..భగత్‌సింగ్‌కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు

- చిరకాల కోరిక నెరవేరిందంటూ పేదల ఆనందం
- వర్చువల్‌గా తిలకించి సంతోషించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీవాసులు చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. దాదాపు 40 సంవత్సరాలుగా ఇళ్ళ పట్టాలు లేకుండా పేదలు పడుతున్న ఇబ్బందులు మంత్రి నారాయణ చొరవతో తీరిపోయాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో, ఈనెల9న రాఖీ పండుగ రోజున 633 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడంతో కాలనీవాసుల ఆనందానికి అవధులు లేవు. మంత్రి నారాయణ పేదలైన భగత్‌సింగ్‌కాలనీ వాసుల సమస్యలను తమ దృష్టికి తేవడంతో, మంత్రివర్గం ఆమోదంతో పట్టాల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు పట్టాల పంపిణీని వర్చువల్‌గా తిలకించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. రాఖీ పండుగ రోజు ఆడబిడ్డలకు పట్టాల పంపిణీ ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. భగత్‌సింగ్ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ అబ్దుల్‌అజీజ్, జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ నందన్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం సమక్షంలో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి తదితరులు పట్టాలను పంపిణీ చేశారు. పట్టాలందుకున్న పేదలంతా ముఖ్యమంత్రికి, మంత్రి నారాయణకు తమ ధన్యవాదాలు తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ, భగత్‌సింగ్‌కాలనీవాసుల చిరకాలకోరికను నేరవేర్చిన సీఎంకు ఆ నిరుపేదల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో భగత్‌సింగ్‌కాలనీ వాసులకు పట్టాలు ఇస్తామని చెప్పారే తప్ప ఇవ్వలేదని, ఎన్నికలకు మూడునెలల ముందు పట్టాలిచ్చారని, వాటిని బ్యాంకులకు తీసుకెళితే బ్యాంకు వారు అవి చెల్లవని చెప్పిన విషయాన్ని తాము ముఖ్యమంత్రికి వివరించామని తెలిపారు. ముఖ్యమంత్రి సహకారంతో ఆ సమస్యలన్నీ పరిష్కారమయ్యాయన్నారు. 1430 మందికి పట్టాలివ్వాల్సి ఉండగా, తొలి విడతలో 633మందికి పట్టాలు ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. మిగిలినవారికి త్వరలోనే పట్టాలిస్తామన్నారు.

# ప్రభగిరిపట్నంలో.. వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- శ్రీ సూర్యనారాయణ, శ్రీకృష్ణపరమాత్మ విగ్రహాల ప్రతిష్ఠ





పొదలకూరు మండలం ప్రభగిరి పట్నంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. ప్రాచీనకాలం నుంచి ఇక్కడ 101 దేవాలయాలు, 101 బావులతో వెలుగొందుతున్న శ్రీ పార్వతిదేవి సమేత కైలాసనాథ స్వామి దేవాలయానికి మరింత వైభవాన్ని చేకూరుస్తూ ఆలయ కమిటీ వారు, గ్రామస్తులు 14వ తేదీ గురువారం నాడు శ్రీ సూర్యనారాయణ స్వామి, శ్రీకృష్ణ భగవానుల విగ్రహాలను ప్రతిష్ఠించి పెద్దఎత్తున పూజలు, సేవలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, సూర్యనారాయణునికి ధాన్యాధివాసం, జలాధివాసం, క్షీరాధివాసం, పంచామృతాభిషేకం, శ్రీ సూర్యనారాయణ సహిత కృష్ణస్వామి మూలమంత్ర హోమం, పూర్ణహుతి అనంతరం స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠలను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకించి ఆ దివ్యమూర్తుల విగ్రహాలను తిరుపతికి చెందిన మహిమలూరు సుబ్బారావు అనే శిల్పి అత్యంత నైపుణ్యంతో రూపుదిద్దడం భక్తాదులందరినీ ఆకట్టుకుంది. ఆరోగ్యప్రదాత అయిన శ్రీ సూర్యనారాయణుని మందిరాలు జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనే అరుదుగా ఉంటాయి. అందులోనూ ఏడు గుఱ్ఱాల ఏకచక్ర రథంతో ఉన్న శ్రీ సూర్యనారాయణ మూర్తిని ఇక్కడ ప్రతిష్ఠించడం విశేషం! ఆ విగ్రహమూర్తి ఎంతో కళగా ఉండడం గ్రామస్తులకు ఆనందాన్నిచ్చింది. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు జరిగిన స్వామివార్ల గ్రామోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ గావించారు. చివరగా స్వామివార్ల కీర్తనలు, భజనలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగిపోయింది. ఎంతో శోభాయమానంగా జరిగిన ఈ దైవ కార్యక్రమానికి గ్రామ ప్రముఖులతో పాటు, భక్త బృందాల వారు, పరిసర ప్రాంతాల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు.

# ధాన్యం కొనుగోళ్లపై.. సోమిరెడ్డితో రైతు నాయకుల భేటీ



త్వరలోనే జిల్లాలో ఎడగారు పంట కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలంటూ రైతు సంఘాల నాయకులు ఇటీవల మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కోరారు. స్థానిక వేదాయపాళెంలోని టీడీపీ కార్యాలయంలో వారు సోమిరెడ్డితో సమావేశమయ్యారు. దాదాపు 3లక్షల ఎకరాల్లో వరిపంటను రైతులు సాగుచేశారని, 7 లక్షల టన్నులకుపైగా దిగుబడి లభిస్తుందని భావిస్తున్నామని వారు సోమిరెడ్డికి తెలిపారు. పంట చేతికొచ్చే సమయం వచ్చింది కనుక, ధాన్యం కొనుగోళ్ళకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేటాయింపులు జరిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు వెంటనే స్పందించిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్‌తో ఫోన్‌లో మాట్లాడి, నెల్లూరుజిల్లాలో రెండో పంట ధాన్యం కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులతో కూడా మాట్లాడి ఈ విషయమై తగు చర్యలు చేపడతామని రైతు నాయకులకు సోమిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు రావూరి రాధాకృష్ణమనాయుడు, చంద్ర రాజగోపాల్, చిరసాని కోటిరెడ్డి, షేక్ షానవాజ్, ఏవీఆర్ నాయుడు, వై.శ్రీనివాసులురెడ్డి, పి.జనార్దన్, ఎం.శ్రీనివాసులురెడ్డి, జె.వెంకటేశ్వర్లు, పి.అశోక్ కుమార్‌రెడ్డి, పి.శంకరకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లిని.. నెల్లూరులోనే ఉంచండి

## • మంత్రివర్గ ఉప సంఘానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి లేఖ

**రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ నేపథ్యంలో, సర్వేపల్లి నియోజకవర్గాన్ని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈనెల 13న ఒక లేఖలో విజ్ఞప్తి చేశారు. ఆ లేఖ సారాంశం ఇలా ఉంది.**

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన ప్రక్రియను స్వాగతిస్తున్నాం..అయితే, కొత్తగా ఏర్పాటు చేయనున్న గూడూరు జిల్లాలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని కలుపుతారని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతామని బహిరంగసభలో ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి వున్నారు. గూడూరు నియోజకవర్గాన్ని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాలో కలపాలని ప్రజలతో పాటు స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పలు వేదికలపై కోరివున్నారు. ఈ విషయంలోనూ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించిన విషయాన్ని మీ అందరి దృష్టికి తీసుకువస్తున్నామని సోమిరెడ్డి ఆ లేఖలో మంత్రివర్గ ఉప సంఘానికి తెలిపారు.




**సర్వేపల్లి... గూడూరులో కలిస్తే.. నెల్లూరుకి ఇక మిగిలేదేమీ ఉండదు.. నారేత వేసుకోవడం, వరికోత కోసుకోవడమే!**

**- సోమిరెడ్డి ఆవేదన**

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపితే ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ, సర్వేపల్లి నియోజకవర్గం విషయంలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నామన్నారు. తమ సర్వేపల్లి నియోజకవర్గం నెల్లూరు నగరానికి చుట్టుపక్కల విస్తరించి వుందని, నెల్లూరు నగరానికి సరిగ్గా తూర్పున తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాలు ఉన్నాయని, పడమర దిక్కున పొదలకూరు మండలం ఉండగా, దక్షిణాన వెంకటాచలం మండలం నెల్లూరులో కలిసిపోయివుందని ఆయన తెలిపారు. గూడూరు కేంద్రంగా ఏర్పాటయ్యే జిల్లా కేంద్రానికి తోటపల్లి గూడూరు, ముత్తుకూరు, పొదలకూరు మండలాల ప్రజలు వెళ్లాలంటే నెల్లూరుకు వచ్చి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు.

కందుకూరు నియోజకవర్గంతో పాటు రామాయపట్నం పోర్టు ప్రకాశం జిల్లాలో చేరిపోనుందని, సర్వేపల్లి కొత్త జిల్లా గూడూరులో కలిస్తే నెల్లూరు జిల్లా ప్రజలు కృష్ణపట్నం పోర్టును కూడా కోల్పోతారని, ఇక నెల్లూరు జిల్లా ప్రజలకు మిగిలింది నారేత వేసుకోవడం, వరికోత కోసుకోవడం మాత్రమేనని ఆయన ఆ లేఖలో స్పష్టం చేశారు.

కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులు, విక్రమ సింహపురి యూనివర్సిటీతో పాటు ఎంతో ప్రాముఖ్యతను నెల్లూరు కోల్పోతుందన్నారు. జిల్లాలో ప్రధాన జలాశయమైన సోమశిల ప్రాజెక్టు కింద ఆయకట్టు మొత్తం ఎక్కువ శాతం కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లోనే ఉంటుంది. సర్వేపల్లిని తీసుకెళ్లి గూడూరులో కలిపితే సాగునీటి పరంగానూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుందని ఆయన వివరించారు.

ప్రజలకు ఏది అనుకూలమైన జిల్లా కేంద్రమో, విభజనతో కొత్తగా వచ్చే సమస్యలేమిటో తదితర అంశాలను మంత్రుల బృందం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని, సర్వేపల్లి నియోజకవర్గాన్ని గూడూరులో కలిపి నెల్లూరు జిల్లా ప్రాముఖ్యతను తగ్గించే ప్రయత్నాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని ఆయన అంటూ, దయచేసి మా సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల కోరిక ప్రకారం సర్వేపల్లిని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నామని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పౌష్టికాహారంతోనే చిన్నారులకు ఆరోగ్యం

పౌష్టికాహారంతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని నెల్లూరులోని అబైండింగ్ హోప్ ట్రస్ట్ ఛైర్మెన్ డాక్టర్ నిర్మల్‌కుమార్ చెప్పారు. ఇటీవల స్థానిక కొండాయపాలెంలోని ఆ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ దాతల సహకారంతో ప్రతినెలా 300మంది చిన్నారులకు గత నాలుగు సంవత్సరాల నుంచి న్యూట్రిషన్ ఫుడ్(పౌష్టికాహారం) ప్యాకెట్లను అందజేస్తుందన్నారు. చిన్నారులతో పాటు, ప్రతి నెలా క్యాన్సర్, టీబీ బాధితులకు కూడా పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ నిర్మల్ కుమార్‌ను సన్మానించారు. ఏ.జయప్రకాష్. సిస్టర్ మ్యాగీ, క్రాంతి కుమార్. శశి, సునంద, జయ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## దైవీగుణాలతో రాణించాలి!



ప్రతిఒక్కరూ సత్యధర్మాలతో జీవించాలని, దైవీగుణాలతో రాణించాలని, భగవంతుడైన శ్రీరామచంద్రుడు ఆ సద్గుణాలతోనే అందరికీ ఆరాధ్యులయ్యారని ప్రముఖ అవధాని, బాలకాండ పద్యానువాదకులు, సంపూర్ణ రామాయణం ఆడియోకర్త..కోట రాజశేఖర్ చెప్పారు. ఇటీవల ఆయన చెన్నైలోని పప్పిశెట్టి రాఘవయ్య చెట్టి చారిటీస్ ఆధ్వర్యంలో జరిగిన 'గీతారామం' కార్యక్రమంలో పాల్గొని 'గీతా ప్రవచనం' అంశంపై ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. భగవద్గీతలో చెప్పినట్లుగా అందరూ అహింసను పాటిస్తూ, త్యాగ నిరతితో శాంతియుతంగా జీవించాలన్నారు. సాధన ద్వారా దైవీ గుణాలు అలవడుతాయని, వాటిని నిజ జీవితంలో చిత్తశుద్ధితో ఆచరించినప్పుడే మానవుడు మాధవుడు కాగలడని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి రామాయణంలోని శ్లోకాలను, రామదాసు కీర్తనలను, దాశరథీ శతకం పద్యాలను హృద్యంగా వినిపించారు. ట్రస్టు నిర్వాహకులు, గోరంట్ల బాలాజీ తదితరులు అవధాని కోట రాజశేఖర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

### జాతీయ టగ్ ఆఫ్ వార్ పోటీలకు..

## నవలాకులతోట విద్యార్థులు



జాతీయస్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు నెల్లూరు నవలాకులతోట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని షిర్డీలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరిగే 38వ జాతీయస్థాయి జూనియర్, సబ్ జూనియర్ టీం, మిక్స్‌డ్ ఈవెంట్స్ టగ్ ఆఫ్ వార్ పోటీలకు అనుబంధంగా ఈనెల 10న వింజమూరులోని శ్రీ సాయి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నెల్లూరు నవలాకుల గార్డెన్స్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పుష్పగిరి జాన్ విక్టర్, ఎంబేటి ఎల్లమ్మ, రేగళ్ల. సుశీల, ఎంబేటి ధరణి, రేగళ్ల శ్రీ హర్షిత అత్యుత్తమ ప్రతిభ కనపరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. వీరు జాతీయ స్థాయిలో జరిగే టగ్ ఆఫ్ వార్ పోటీల్లో మన రాష్ట్రం తరపున పాల్గొంటారు.

## విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి




విద్యార్థుల్లో చిన్నతనం నుంచి దేశభక్తిని పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని నెల్లూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ అన్నారు. ఇటీవల నెల్లూరులోని ఎస్‌విఆర్ హైస్కూల్లో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నెరసం నిర్వహించిన చిత్రలేఖనం, కవితల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల చరిత్రను ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర తెలుసుకునేందుకే తాము ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అందె శ్రీనివాసులును సత్కరించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా సందడి అరుణ, సయ్యద్ నజ్మా షమ్మీ, ఏ.భారతి, కె.రవి వ్యవహరించారు. ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు కుని అంకబాబు పర్యవేక్షించారు.

## టూకీగా...



### ఉదయగిరిలో అంగన్‌వాడీల ఆందోళన

గతంలో ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదని, కొత్తవి ఇవ్వాలని కోరుతూ ఈనెల12న ఉదయగిరిలో సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్‌ల నాయకులు కె.రమణయ్య, రజియా ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఆ ఫోన్లు సరిగా పనిచేయకపోవడంతో తమతో పాటు లబ్దిదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

### విడవలూరులో మాదకద్రవ్యాలపై అవగాహన

విడవలూరులో డిగ్రీకళాశాలలో ఈనెల 12న ఎస్‌ఐ నరేష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల పట్ల అవగాహన కలిగించారు. మాదకద్రవ్యాలు వినియోగిస్తే ఎంత ప్రమాదమో వారికి వివరించారు. మాదక ద్రవ్యాలను వినియోగించడం కానీ, కలిగి ఉండడం కానీ నేరమని, వాటికి విద్యార్థులంతా దూరంగా ఉండాలని స్పష్టం చేశారు.

### తురిమెర్లలో 'పొలం పిలుస్తోంది'

దగదర్తి మండలం తురిమెర్లలో ఈనెల 12న మండల వ్యవసాయాధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి రైతులకు సాగు మెళకువల పట్ల అవగాహన కలిగించారు. భూసారం పెంపొందించుకునేందుకు అన్ని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు 50 శాతం సబ్సిడీతో ఇస్తున్నారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### కోవూరులో అన్నదానం

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని, కోవూరులో కొలువై వున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ఇటీవల అన్నదానం నిర్వహించారు. ఉభయకర్తలు కేతిరెడ్డి సుమన్–అరుణ, కుటుంబసభ్యుల సహకారంతో ఈనెల 12న ఈ కార్యక్రమం జరిగింది.

### వింజమూరులో 'ఆల్బెండజోల్' మాత్రలు పంపిణీ

జాతీయ నులిపురుగుల నివారణ దినంలో భాగంగా ఈనెల 12న మండలకేంద్రమైన వింజమూరులోని సుజాతనగర్ కాలనీలో 'ఆల్బెండజోల్' మాత్రలు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీఓ శర్మిష్ఠ, సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్‌వాడీ–ఆశా కార్యకర్తలు బి.శారద, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

### చెర్లోయడవల్లి హైస్కూలుకు విద్యాసామగ్రి

ఆత్మకూరు మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలోని హైస్కూల్ విద్యార్థులకు దాత అల్లంపాటి రాజేష్ ఇటీవల విద్యాసామగ్రిని అందజేశారు. విద్యార్థులంతా కష్టపడి చదువుకుని ఉత్తీర్ణులు కావాలని, తల్లితండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పోతుకొండ అంకాళమ్మకి ప్రత్యేక పూజలు

రాపూరు మండలం తూమాయి గ్రామం వద్ద పోతుకొండపై వెలసివున్న శ్రీ అంకాళమ్మ తల్లికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆది, మంగళవారాల్లో జరిగే ఈ పూజలకు పెద్దసంఖ్యలో భక్తజనం వచ్చి, మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఈనెల10 ఆదివారం రోజున అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి విశేషపూజలు చేశారు.

### వల్లూరులో రైతులకు సూచనలు

ముత్తుకూరు మండలం వల్లూరు గ్రామంలో ఈనెల 11న వ్యవసాయాధికారులు రైతులకు వరి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను సూచించారు. వ్యవసాయ అధికారిణి జ్యోత్స్నారాణి ఆధ్వర్యంలో రైతులకు సమగ్ర సస్యరక్షణ, ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. గ్రామ వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### ముదివర్తిలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

విడవలూరు మండలంలోని ముదివర్తి గ్రామంలోని పెన్నానది సమీపంలో పేకాటాడుతున్న నలుగురిని ఇటీవల విడవలూరు పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.4 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్‌యాదవ్ తెలిపారు.



## ప్రధాని మోడీని సన్మానించిన విపిఆర్

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఇటీవల నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) మర్యాదపూర్వకంగా కలుసుకుని ఘనంగా సన్మానించారు. ఈనెల 11న ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయానికి ఆయన పలువురు ఎంపీలతో వెళ్ళి ప్రధానిని కలిశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డిని ప్రధాని నరేంద్ర మోడీ ఆప్యాయంగా పలకరించారు. దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తూ 'ఆపరేషన్ సిందూర్' ద్వారా మన దేశ సైనిక పరాక్రమాలను ప్రపంచానికి ప్రదర్శించారంటూ ప్రధానమంత్రిని విపిఆర్ కొనియాడారు.

## మంత్రి నారాయణకు.. ఆర్యవైశ్యుల కృతజ్ఞతలు



రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణను ఇటీవల నెల్లూరులోని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. అసెంబ్లీ ఎన్నికలు జరగకముందు టీడీపీ నేతలు ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన త్యాగధనుడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు స్మారకంగా అమరావతిలో స్మృతివనం, ఉద్యానవనం, మరియు 58 అడుగుల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటుచేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మాటకు కట్టుబడి వాటి నిర్మాణాలకు ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో, పురపాలక మంత్రి నారాయణ ఆధ్వర్యంలో.. అమరావతిలో 6.8ఎకరాల భూమి డాక్యుమెంట్‌లను రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మెన్ డూండి రాకేష్‌కి అప్పజెప్పడంతో ఆర్యవైశ్యులు ఆనందపరవశులయ్యారు. అమరజీవి స్మారకాలకు అంతటి విశేష ప్రాధాన్యత ఇచ్చినందుకు ప్రతి ఒక్క ఆర్యవైశ్య కుటుంబసభ్యుడు, మరియు తెలుగుప్రజలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఎన్డీఏ కూటమికి ఎల్లప్పుడు మద్దతుగా ఉంటామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇటీవల మంత్రి నారాయణ నెల్లూరుకు వచ్చినప్పుడు, ఆయన నివాసంలో ఆర్యవైశ్య ప్రముఖులంతా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ వాణిజ్యవిభాగం నాయకుడు దర్శి హరికృష్ణ, అమరజీవి పొట్టి శ్రీరాములు చారిటబుల్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు కోట మధుసూదన్‌రావు, నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తాతా కిషోర్, ఫ్యాన్సీ అండ్ జనరల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు టి.మల్లికార్జున, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం మంత్రి నారాయణకి జ్ఞాపికనందించి ఘనంగా సన్మానించారు. బ్రహ్మం గుప్తా, దర్శి ప్రకాష్, మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుగ్గి అశోక్, శ్రీధర్, ధనుంజయ, రమేష్, శ్రావణచంద్ర, కనమర్లపూడి గోపి, సురేష్, సుమన్, ముస్తాఖ్‌బాయ్, భాస్కర్, ప్రసాద్, రియాజ్, రమణ, మల్లి, పి.రమేష్, గ్రంధి సురేష్, దుగ్గి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాల సంస్కార కేంద్రాలకు..లక్ష విరాళం



నెల్లూరులోని సింహపురి వైద్య సేవా సమితి (జయభారత్ ఆసుపత్రి) వారు గిరిజన కాలనీలలో నిర్వహిస్తున్న బాల సంస్కార కేంద్రాల నిర్వహణకు సింహపురి వైద్య సేవా సమితి ఛైర్మెన్ పొన్నలూరు సీతారామిరెడ్డి వారి తల్లితండ్రులు పొన్నలూరు వీరారాఘవరెడ్డి, రాజేశ్వరమ్మల జ్ఞాపకార్థం ఇటీవల లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు.ఆ చెక్‌ను సంస్థ ఉపాధ్యక్షులు బాలు సుబ్బారావుకి అందచేశారు. సీతారామిరెడ్డి మాట్లాడుతూ, తమ సంస్థ విద్య, వైద్య, ఉపాధి రంగాలలో గిరిజనుల అభ్యున్నతి కోసం చేయూతనిస్తోందన్నారు. జయభారత్ ఆసుపత్రిలో గిరిజనుల కోసం ఉచితంగా 10పడకల వైద్యశాల కూడా నిర్వహిస్తున్నామని, అదేవిధంగా జిల్లాలోని 54 గిరిజన కాలనీలలో బాలబాలికలకు బాలసంస్కార కేంద్రాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలకు చదువుతోపాటు సంస్కారం, దేశభక్తి విషయాలను నేర్పుతున్నామని, వీటిద్వారా వారిలో చదువుపై ఆసక్తి పెరిగి, మధ్యలో చదువు మానేయకుండా కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి గుర్రం సుధాకర్, జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్, అకౌంట్స్ మేనేజర్ రమణయ్య పాల్గొన్నారు.

# బద్దలైన వైకాపా కంచుకోట

### పులివెందుల-ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలు తెలుగుదేశం పార్టీ కైవసం





***వైకాపా కంచుకోట బద్దలైంది. అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్న రెండు జడ్పీటీసీల ఉప ఎన్నికల్లో కనీవినీ ఎరుగని విధంగా, టీడీపీ విజయ దరహాసంతో దూసుకుపోయింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంతగడ్డపై జరిగిన ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందడం విశేషం. పులివెందుల, ఒంటిమిట్టల్లో జరిగిన ఈ ఎన్నికల్లో గెలుపు ప్రతిష్టాత్మకంగా మారడం అందరికీ తెలిసిందే. గురువారం వెలువడిన ఉప ఎన్నిక ఫలితాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి.***

కడపజిల్లాలోని పులివెందుల జడ్పీటీసీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికకు సంబంధించి పూర్తి ఫలితాలు గురువారం వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎవరూ ఊహించనంత స్థాయిలో భారీ ఓట్లతో విజయం సాధించడం రాజకీయవర్గాలను సైతం విస్మయానికి గురిచేసింది. మొత్తం 7638 ఓట్లలో టీడీపీ తరపున పోటీచేసిన మారెడ్డి లతారెడ్డి 6716 ఓట్లు సాధించి 6,033 ఓట్ల మెజార్టీతో విజయదుందుభి మోగించగా, వైకాపా అభ్యర్థి హేమంత్‌రెడ్డికి కేవలం 683 ఓట్లే వచ్చాయి. వైకాపా అధినేత జగన్ సొంతగడ్డపై టీడీపీకి ప్రజలు నీరాజనం పట్టారు.

అదేవిధంగా, పోటాపోటీగా సాగిన ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలో కూడా టీడీపీయే భారీ విజయం సాధించింది. వైకాపా అభ్యర్థి సుబ్బారెడ్డికి 6,513 ఓట్లు రాగా.. టీడీపీ అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డికి 12,780 ఓట్లు వచ్చాయి. 6,267 ఓట్ల అత్యధిక మెజార్టీతో టీడీపీ ఈ స్థానాన్ని గెలుచుకోవడంతో ఒంటిమిట్టలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. చాలాకాలం తర్వాత ఈ స్థానాల్లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాయి కాబట్టి, అసలైన ప్రజాదరణ ఎవరికో మరోసారి తేటతెల్లమైందని, ప్రజలు ప్రజాప్రభుత్వాన్ని సమర్థిస్తూ, టీడీపీకి ఓటు వేశారని, తెలుగుదేశం పార్టీకి ఉన్న ప్రజాదరణకు ఇదో నిదర్శనమని టీడీపీ వర్గాలవారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏదేమైనా, తప్పకుండా గెలుస్తామని భావించిన ఈ రెండు స్థానాల్లో చతికిలబడిపోవడంతో వైకాపా వర్గాలు డీలా పడిపోయాయి.

### విపిఆర్ దంపతుల దాతృత్వంతో..

# కొండ బిట్రగుంటకు కొత్త శోభ

- స్వామివారి పుష్కరిణి నిర్మాణానికి రూ.2.10 కోట్ల విరాళం
- వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలకల్లా పూర్తి చేయాలని నిర్ణయం





***జిల్లాలోని అత్యంత ప్రాచీనమైన శ్రీ వేంకటేశ్వర క్షేత్రం..బోగోలు మండలంలోని కొండ బిట్రగుంటలో ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం కోనేరు నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు నెల్లూరు ఎంపీ..మహాదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి 2 కోట్ల 10 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఇటీవల ఆయన కొండబిట్రగుంటను సందర్శించుకుని శ్రీవారి భక్తుల కలలను సాకారం చేయదానికి సంకల్పించారు. ఆ బిలకూట క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తన సతీమణి..కోవూరు శాసనసభ్యురాలు..తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావలి ఎమ్మెల్యే డివి కృష్ణారెడ్డితో కలిసి కోనేరు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రజలు వేమిరెడ్డి దంపతులకు ఘన స్వాగతం పలికారు.***

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండదండలందిస్తూ, తమ దాతృత్వంతో ఇప్పటికే జిల్లాలో ఎన్నో మహత్కార్యాలు చేసిన వేమిరెడ్డి దంపతులు తాజాగా ఈనెల 10న కొండబిట్రగుంట దేవస్థానం సేవలో తరించారు. కలియుగ దైవం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి కోనేరు పునరుద్ధరణకు తమ వంతుగా 2.10 కోట్ల విరాళం అందించి శ్రీవారి పట్ల తమకున్న శ్రద్ధాభక్తులను చాటుకున్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సతీమణి జ్యోతి తదితరులతో కలిసి కోనేరు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత, దేవాదాయ శాఖ నిధులు రూ.1.65 కోట్లతో చేపట్టనున్న ఆలయ మహాప్రాకారానికి కూడా వారు భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు.

### అంతా పూర్వజన్మ సుకృతం - ప్రభాకరరెడ్డి

ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకోగలగడం, ఆ స్వామి ఆశీస్సులతో కోనేరు పునర్‌నిర్మాణానికి కృషి చేయగలగడం తమ పూర్వజన్మ సుకృతమన్నారు. దాదాపు రూ.2.10 కోట్లతో పుష్కరిణి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది బ్రహ్మోత్స వాలకల్లా ఆ నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. స్వామివారు తమకు ప్రసాదించినదాంట్లోనే ఇదంతా చేస్తున్నామన్నారు. స్వామివారి పుష్కరిణి బాధ్యత తమకు దక్కడం అదృష్టమన్నారు. 800 ఏళ్ల చరిత్ర ఉన్న స్వామివారి ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

### వేదపాఠశాల ఏర్పాటుకు ప్రయత్నిస్తా - ప్రశాంతిరెడ్డి

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రసన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవాలని పలుమార్లు అనుకున్నానని, ఇప్పుడు కోనేరు శంకుస్థాపన సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి 15 కోట్ల నిధులు సాధించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. అలాగే టీటీడీ తరపున వేద పాఠశాల ఏర్పాటుపై కూడా చర్చిస్తామని ఆమె చెప్పారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com